

జీజీహెచ్‌లో రోగులకు అందని సీటీ ఫిల్మ్

జీజీహెచ్(కాకినాడ), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో స్కానింగ్ రిపోర్ట్ ఫిల్మ్ ఇవ్వడంలేదు. దీంతో రోగులకు ఇబ్బందులు తప్పట్లేదు. కాకినాడ జీజీహెచ్‌కు పలు అనారోగ్య సమస్యలు, వివిధ రోడ్డు ప్రమాదాలు వంటి కారణాలతో రోజుకు 4వేలమంది వరకు వస్తుంటారు. వారిని ఆస్పత్రి వైద్యులు పరీక్షించి సమస్య తీవ్రతను బట్టి కొంతమందికి ఎక్స్‌రేలు, మరికొందరికి ఎంఆర్ఐ స్కాన్‌లు, ఇంకొందరికి సీటీస్కాన్‌లు రాస్తుంటారు. జీజీహెచ్‌లో సీటీస్కాన్, ఎంఆర్ఐ స్కాన్ యూనిట్లు పీపీపీ విధానంలో పనిచేస్తున్నాయి.

ఎస్ఎల్ డయాగ్నోస్టిక్స్ ప్రైవేటు సంస్థ ఈ సీటీస్కాన్ యూనిట్‌ను నిర్వహిస్తోంది. వైద్యులు శస్త్రచికిత్సనిర్వహించాలన్నా, నరాల్లో సూక్ష్మమైన సమస్యలను గుర్తించి ఔషదాలు ఇవ్వాలన్నా స్కానింగ్ రిపోర్ట్‌తోపాటు ఫిల్మ్ తప్పనిసరి. గతంలో రిపోర్ట్‌ను ఉచితంగా అందజేసి నామమాత్రపు రుసుంతో అక్కడ నిర్వాహకులు ఫిల్మ్‌ను అందజేసేవారు. రెండునెలలుగా ఫిల్మ్‌లు ఇవ్వకుండా రిపోర్ట్ ఇస్తున్నారు. దీంతో ఫిల్మ్ అందక రోగులు వైద్యానికి ఇబ్బందులకు గురవుతున్నారు. ఫిల్మ్‌ఉంటేనే మెరుగైన వైద్యచికిత్స అందజేసేందుకు వీలు కలుగుతుందని వైద్యులు చెప్తుండడంతో రోగులు, క్షతగాత్రులు ఆవేదనకు గురవుతున్నారు. డాక్టర్ ఎన్‌టీఆర్ వైద్యసేవలో శస్త్రచికిత్సలు చేయాలంటే ఫిల్మ్ తప్పనిసరిగా ఉండాలని లేకుంటే అనుమతులు ఇవ్వడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



జీజీహెచ్‌లో సీటీస్కాన్ యంత్రం

గోవిందా హరి గోవిందా!

గోవిందా హరి గోవిందా.. గోకులనందన గోవిందా అంటూ కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వర స్వామిని భక్తజనం కొలిచారు.. 13వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం బ్రహ్మండంగా నిర్వహించారు. ఆదివారం కావడంతో పెద్ద ఎత్తున భక్తజనం తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. శ్రీవారు కోదండరామ అలంకృతుడై హనుమద్ వాహనంపై తిరువీధుల్లో విహరించారు. అశేష భక్తజనం వాహన సేవలో పాల్గొని తన్మయత్వం పొందారు. 7





బాధితుల ఫైర్!

పరిహారానికి డిమాండ్

- రాయవరంలో ప్రమాదం
- 10కి చేరిన మృతుల సంఖ్య
- నేటికీ బాధితులకు అందని సాయం

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రాయవరంలో ఈ నెల 8న జరిగిన బాణసంచా భారీ విస్ఫోటనంలో మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. నాటి ఘటనలో సంఘటనా స్థలంలో ఆరుగురు సజీవ దహనమయ్యారు. నలుగురు కాకినాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఒక్కొక్కరిగా మృత్యువాత పడ్డారు. దీంతో ఆదివారం నాటికి బాణసంచా మృతుల సంఖ్య పదికి చేరింది. మొత్తం మృతుల్లో ఒకరు ఒడిశా ప్రాంతానికి చెందినవారు కాగా మరొకరు శ్రీలక్ష్మీగణపతి గ్రాండ్ ఫైర్‌వర్క్స్ యజమాని వెలుగుబంట్ల సత్యనారాయణమూర్తి అలియాస్ సత్తిబాబు ఉన్నారు.మిగిలిన 8 మందిలో అనపర్తి, పెదపూడి, రాయవరం ప్రాంతాలకు చెందిన మహిళా కూలీలు ఉన్నారు. దినసరి కార్మికులుగా పనిచేస్తూ జీవనం గడుపుకుంటున్నారు. వీరికి అటు ప్రభుత్వం తరపున గానీ, ఇటు ఫైర్‌వర్క్స్ యాజమాన్యం తరపున గానీ ఎటువంటి సహాయం అందలేదు. యాజమాన్య సంస్థ కార్మికుల పేరిట బీమా వంటి సౌకర్యాలు కల్పించకపోవడంతో మృతుల కుటుంబాలవారు బోరున విలపిస్తున్నారు. ప్రభుత్వ పరంగా తమ కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. ఘటనా స్థలానికి రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌లతో పాటు ఎమ్మెల్యేలు వేగుళ్ల జోగేశ్వరరావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి వెళ్లినప్పుడు తమ కుటుంబాలను ఆదుకోవాలంటూ వేడుకోలు చేసుకున్నారు. ప్రభుత్వం రాయవరం ఘటనపై విచారణ కమిటీని నియమించిందని...ఆ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం ప్రభుత్వం ప్రకటిస్తుందనే సమాచారాన్ని ప్రజాప్రతినిధులు బాధిత కుటుంబీకులకు చెబుతున్నారు. పది మంది కుటుంబీకులకు ప్రభుత్వం నుంచి తక్షణసాయం అందించి ఆదుకోవాలంటూ ఇప్పటికే ప్రజాసంఘాలు వారి పక్షాన నిలబడి ఆందోళన చేపట్టాయి. ఇదే డిమాండ్‌ను స్థానిక ఎమ్మెల్యేల దృష్టికి బాధిత కుటుంబీకులు తీసుకువెళ్లారు. తమకు న్యాయం చేయాలని బాధితులంతా ప్రభుత్వాన్ని, సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లను కోరుతున్నారు.



గురువులు.. కొత్త కొలువులు!

రాజమహేంద్రవరంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుతో కొత్త టీచర్లు(ఫైల్)

- నేటి నుంచి స్కూళ్లకు కొత్త మాస్టార్లు
- మెగా డీఎస్సీ-2025 ద్వారా ఎంపిక
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఖాళీల భర్తీ
- మాట నిలుపుకున్న కూటమి సర్కారు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

అంతా అనుకున్నట్టే జరిగింది. ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీని విజయవంతంగా పూర్తి చేసింది. కొత్త ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందజేయడంతో పాటు పోస్టింగ్ ఉత్తర్వులూ అందించింది.దీంతో నూతనోపాధ్యాయులు సోమవారం నుంచి బడి బాట పట్టేందుకు సిద్ధమయ్యారు. పాఠాలు చెప్పే పనిలో బిజీబిజీగా అవనున్నారు. మరోవైపు కూటమి ప్రభుత్వం జనవరిలో మరో డీఎస్సీ నిర్వహణకు సిద్ధమవుతోంది.మరో మూడు వేల పోస్టుల భర్తీకి కసరత్తు చేస్తోంది.

1693 పోస్టులు భర్తీ

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో మెగా డీఎస్సీ-2025కు ఈ సారి భారీగా దరఖాస్తులొచ్చాయి..అన్ని మేనేజ్‌మెంట్లు కలిపి 1,241 పోస్టులకు 63,004 దరఖాస్తులు వచ్చాయి. 38,617 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఎస్జీటీ 423, స్కూల్ అసిస్టెంట్ 818 ఉన్నాయి. ట్రైబల్ వెల్ఫేర్ విభాగంలో ఎస్ఏ (పీఎస్) 3, ఎస్ఏ (బీఎస్) 4, ఎస్ఏ(పీఈ) 1, ఎస్జీటీ 104 ఖాళీగా ఉన్నాయి. జోన్-2 పరిధిలో ఏపీ రెసిడెన్షియల్, ఏపీ మోడల్ స్కూళ్లు, ఏపీ సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్/బీసీ వెల్ఫేర్/ట్రైబల్(గురుకులం) యాజమాన్య పాఠశాలల్లో 348 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. ఇందులో పీజీటీ 49, టీజీటీ 272, పీడీ 3, పీటీ 24 పోస్టులు భర్తీ చేసేలా నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.ఈ పోస్టులన్నింటికీ ఈ ఏడాది ఏప్రిల్‌లో నోటిఫికేషన్ ఇచ్చింది.జూన్, జూలై నెలలో మెగా డీఎస్సీ పరీక్ష నిర్వహించారు.ఆగస్టులో కీ, ఫైనల్ ఫలితాలు వెల్లడయ్యాయి. ధ్రువపత్రాల పరిశీలన ఆగస్టు 28 నుంచి ఏడు దశల్లో జరిగింది. ఉద్యోగ నియామక పత్రాలను సెప్టెంబరు 25న అమరావతిలో అందజేశారు. అక్టోబరు మూడు నుంచి పదో తేదీ వరకు పలు కేంద్రాల్లో శిక్షణ ఇచ్చారు. వృత్తిలో పెంపొందించుకోవాల్సిన నైపుణ్యాలు వివరించారు. విద్యాశాఖ విధివిధానాలు, కార్యక్రమాలపై అవగాహన కల్పించారు.

టీచర్ల కొరత తీరింది..

కూటమి ప్రభుత్వం ప్రాథమిక, ప్రాథమికోన్నత, జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల కొరత తీర్చింది. మెగా డీఎస్సీ-2025 ద్వారా ఖాళీలను భర్తీ చేసింది. ఎంపికైన కొత్త గురువులు ఇప్పటికే ఎనిమిది రోజుల పాటు శిక్షణ పూర్తి చేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయుల వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న ఖాళీలను ప్రకటించారు.వారికి కావాల్సిన స్థానాన్ని ఎంపిక చేసుకునేలా ఏర్పాట్లు చేశారు. శనివారం నూతనోపాధ్యాయులు ఎంచుకున్న స్థానాలను కేటాయిస్తూ పోస్టింగ్ ఉత్తర్వులు అందజేశారు. పోస్టింగ్ ఉత్తర్వులు ఈ నెల 11వ తేదీన అభ్యర్థుల మొబైల్‌లోని లీప్ యాప్‌కు పంపారు. అందులో నుంచి దాన్ని డౌన్‌లోడ్ చేసుకున్నారు. పోస్టింగ్ ఉత్తర్వులు అందుకున్న అభ్యర్థులు అందరూ విద్యాశాఖాధికారులు సూచించిన అన్ని రకాల విద్యార్హతలు,కులం, ఆధార్, పాన్ కార్డు తదితర వాటిని తీసుకుని వారికి పోస్టింగ్ ఉత్తర్వుల్లో పేర్కొన్న పాఠశాలలకు హాజరుకావాలని జిల్లా విద్యాశాఖాధికారులు సూచించారు.కొత్తకొలువులో చేరేందుకు నూతన ఉపాధ్యాయులు సమాయత్తమవుతున్నారు. కూటమి ప్రభుత్వం తమ ఎన్నికల మేనిఫెస్టోలో మెగా డీఎస్సీ ద్వారా భారీగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని ప్రకటించింది. ఇచ్చిన మాట ప్రకారమే వేలాదిగా పోస్టులను భర్తీ చేసింది. ఉపాధ్యాయ వృత్తిలో తమ నుభాగస్వాములుగా చేసి ందని 'కొత్త టీచర్లు' హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేట్ కేంద్రాల తాగునీటితో ఆరోగ్య సమస్యలు

- ఆర్‌డబ్ల్యుఎస్ ప్రభుత్వ సలహాదారు ప్రభాకరరావు

సామర్లకోట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణాలు, పల్లెల్లో ప్రైవేట్ మంచినీటి కేంద్రాల ద్వారా సరఫరా అవుతున్న తాగునీరు ప్రస్తుతానికి రుచిగాఉన్నా రానున్న రోజుల్లో ఆరోగ్య సమస్యలు తప్పవని ఆర్‌డబ్ల్యుఎస్ ప్రభుత్వ సలహాదారు తోటప్రభాకరరావు అన్నారు. సామర్లకోటలోని విస్తరణ శిక్షణ కేంద్రం ఆవరణలో ఆదివారం ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈలు, డిప్యూటీ ఎంపీడీవోల 7వ బ్యాచ్ శిక్షణను ప్రిన్సిపాల్ ప్రసాదరావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభాకరరావు మాట్లాడుతూ ప్రభుత్వం సరఫరా చేస్తున్న తాగునీటిని ప్రజలందరూ తాగేలా నీటి నాణ్యతా ప్రమాణాలు మెరుగుపడాలని సూచించారు. మండలస్థాయిలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, డిప్యూటీ ఎంపీడీవోలు సమన్వయంతో పనిచేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తాగునీటి సరఫరాకు రూ.10వేల కోట్లకుపైగా ఖర్చు చేస్తున్నాయన్నారు. శిక్షణలో విశ్రాంత ఎస్ఈలు ఉమాశంకర్, శ్రీనివాసు, సురేష్, పెద్దాపురం డీఈఈ స్వామి, పెద్దాపురం ఏఈఈ శ్రీరామ్, సీనియర్ ఫ్యాకల్టీ శేషుబాబు పాల్గొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న 6వ బ్యాచ్ వారికి సర్టిఫికెట్లు అందజేశారు.

నేడు కలెక్టరేట్లో పీజీఆర్ఎస్

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం యథావిధిగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈమేరకు ఒక ప్రకటన వెలువరించారు. సోమవారం ఉదయం 10గంటలనుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు అర్జీలను స్వీకరిస్తారన్నారు. అధికారులంతా విధిగా హాజరవ్వాలన్నారు.

'రంగరాయ'లో హాస్టల్ నిర్మాణం పూర్తి చేస్తాం

- కాకినాడ ఎంపీ ఉదయ్

కలెక్టరేట్(కాకినాడ),అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్యకళాశాలలో అసంపూర్తిగా ఉన్న వైద్యవిద్యార్థినుల (మహిళ) హాస్టల్ భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేస్తామని కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ హామీఇచ్చారు. రంగరాయ పూర్వవిద్యార్థులు సంఘంప్రతినిధులు డాక్టరు ఆనంద్, డాక్టరు వాడ్రేవు రవి కాకినాడ క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎంపీతో భేటీఅయ్యారు. అనంతరం రంగరాయలో హాస్టల్‌ను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంనుంచి నిధులు తీసుకురావడానికి తనవంతు ప్రయత్నం చేస్తామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

నేటినుంచి కోకనాడ షాపింగ్ సంబరాలు

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరంలో దేవాలయం రోడ్డులోఉన్న పైడా చలమయ్య కల్యాణ మండపంలో సోమవారం నుంచి కోకనాడ షాపింగ్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన వెలువరించారు. జీఎస్టీ 2.0 ద్వారా ధరల తగ్గింపుపై వినియోగదారులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడానికి 8రోజులపాటు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో హోమ్ అప్లయన్స్ సిమెంట్ డీలర్లు, స్పోర్ట్స్ పరికరాలు, మెట్రాస్, బుక్స్‌స్టేషనరీ, సోలార్ ప్యానల్స్, కెమిస్ట్ డ్రగ్గిస్ట్, ఎలక్ట్రానిక్ వస్తువులు, గృహోపకరణాలు వంటివి స్టాల్స్ ఏర్పాటు చేశారన్నారు.

17 నుంచి సత్యదీక్షలు

అన్నవరం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సత్యదీక్షలు స్వీకరించే భక్తులకు ఆదివారం ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్ దీక్షావస్త్రాలను అందజేశారు. ఈనెల 17 నుంచి సత్యదీక్షలు ప్రారంభంకానున్నాయి. దీక్షాపరులు ఈనెల 17న, 18రోజుల దీక్షలు స్వీకరించే దీక్షాపరులు ఈనెల 26న, 9రోజులు దీక్షలు ఆచరించే భక్తులు నవంబరు 4న దీక్షలు తీసుకోవాల్సిఉంది. నవంబరు 13న ఇరుముడు సమర్పించి విరమించాలి.

నిధుల.. దారులు!



అభివృద్ధి చేయనున్న గొల్లప్రోలు పరిధిలోని ప్రధాన రహదారి

ఉమ్మడి జిల్లాలో రోడ్లకు రూ 88.25 కోట్లు నిధులు

- మూడో విడత ఇచ్చేశారు
- ఇప్పటికే రూ.96 కోట్లు విడుదల
- రెండు విడతలుగా కేటాయింపు
- టెండర్ల ప్రక్రియ ప్రారంభం
- ఆర్‌అండ్‌బీ శాఖ కసరత్తు
- గుంతల్లేని రహదారులే లక్ష్యం

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

రహదారుల అభివృద్ధికి నిధులు పుష్కలంగా విడుదలవుతున్నాయి. గుంతల్లేని రోడ్ల లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చేస్తున్న కసరత్తులో భాగంగా ఆర్ అండ్‌బీ శాఖ ద్వారా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు ఇప్పటికే రెండు విడతల్లో నిధులు లభించగా, ఇప్పుడు మరో విడత నిధులను కేటాయించారు. టెండర్లు పిలిచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. వైసీపీ హయాంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధికంగా నిధులు కేటాయిస్తోంది.ఇప్పటికే రహదారులకు మరమ్మతులు నిర్వహించడంతో పాటు అభివృద్ధి చేశారు.

టెండర్ల ప్రక్రియలో..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ఆర్‌అండ్‌బీ శాఖ ఆధీనంలో ఉన్న రాష్ట్ర, జిల్లా రహదారులు అభివృద్ధికి పలు విడతలుగా ప్రభుత్వం నిధులు కేటాయించింది. అధికారంలోకి వచ్చిన తొలినాళ్లల్లో కేటాయించిన నిధులతో కొన్ని ప్రధాన రోడ్లకు అభివృద్ధి చేశారు. తదనంతరం రెండు విడతలుగా రహదారుల అభివృద్ధికి రూ.96 కోట్లు విడుదల చేశారు. ఈ పనులకు ఆర్‌అండ్‌బీ అధికారులు ఇప్పటికే టెండర్లు పిలిచారు. ఇందులో కొన్నింటికి టెండర్ల ప్రక్రియ పూర్తి కాగా మరికొన్ని పరిశీలన దశలో ఉన్నాయి. వీటిని వర్షాలు తగ్గగానే చేపట్టి మార్చి నెలాఖరు నాటికి పూర్తిచేయాలని అధికారులు భావిస్తున్నారు.

మరో విడత నిధులు

రాష్ట్రవ్యాప్తంగా రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.వెయ్యి కోట్లు మంజూరు చేసింది. 108 రాష్ట్ర రహదారులు అభివృద్ధికి రూ.400కోట్లు, 166 ప్రధాన జిల్లా రహదారులకు రూ.600 కోట్లు విడుదల చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న 25 రాష్ట్ర, జిల్లా రహదారుల అభివృద్ధికి రూ.88.25 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.కాకినాడ జిల్లాలో 9 రోడ్ల అభివృద్ధికి రూ.35.25 కోట్లు, అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో 10 రోడ్లకు రూ30.15 కోట్లు, తూర్పుగోదావరి జిల్లాలో ఆరు రహదారుల అభివృద్ధికి రూ.22.85 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో పనులు చేపట్టేందుకుగాను టెండర్లు పిలిచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

కాకినాడ జిల్లాకు ఇలా..

రాష్ట్ర రహదారుల్లో కాకినాడ జిల్లాలోని కాకినాడ-ఫైన రహదారి అభివృద్ధికి రూ.5 కోట్లు, నరసరాపుపేట-కాట్రావులపల్లి రోడ్డుకు రూ.2 కోట్లు, తుని-కత్తిపూడి మధ్య అత్యంత అధ్వానంగా ఉన్న రోడ్డు అభివృద్ధికి రూ. 3.50 కోట్లు కేటాయించగా ప్రధాన జిల్లా రహదారుల్లో ఎర్రకోనేరు-వేమవరం రోడ్డుకు రూ.3.75 కోట్లు, మర్లావ-తిరుపతి-చంద్రమాంపల్లి రోడ్డు, కట్టమూరు-జె.తిమ్మాపురం రోడ్ల అభివృద్ధికి రూ.3.60 కోట్లు,తాళ్లూరు ఎన్‌హెచ్16-యల్లమిల్లి రోడ్డుకు రూ.2 కోట్లు, సర్పవరం జంక్షన్-లైట్‌హౌస్ రోడ్డుకు రూ2.80 కోట్లు, అమీనాబాద్-యు.కొత్తపల్లి రోడ్డుకు రూ.4.20 కోట్లు, ఉండూరు బ్రిడ్జి-చేదువాడ-మంజేరు-పటవల రోడ్డుకు రూ.4.50 కోట్లు,గొల్లప్రోలు పట్టణం, చేబ్రోలు గ్రామాల పరిధిలోని ఆర్అండ్‌బీ ప్రధాన రహదారుల అభివృద్ధికి రూ.3.90కోట్లు కేటాయించారు.

కోనసీమ జిల్లాలో..

రాష్ట్ర రహదారుల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని సిరిపల్లి-మునిపల్లి రోడ్డు అభి వృద్ధికి రూ.3.50 కోట్లు, రాజవరం-పొదలాడ రోడ్డుకు రూ.3.90 కోట్లు, మండపేట-దుళ్ల రోడ్డుకు రూ.3.50 కోట్లు,సోమేశ్వరం-రాజానగరం రోడ్డుకు రూ.3.50కోట్లు, శివకోడు-మానేపల్లి రోడ్డుకు రూ.2.10 కోట్లు, ఇదే రోడ్డుకు మరో రూ.2.20 కోట్లు విడుదల చేశారు. ప్రధాన జిల్లా రహదారుల్లో విశ్వేశ్వరపురం-దిండి రోడ్డు, గూడపల్లి-గుబ్బలపాలెం-అడవిపాలెం-శేశనపల్లి రోడ్డు, మామిడికుదురు-అప్పనపల్లి-పాతపట్నం లంక రోడ్ల అభివృద్ధికి రూ.4.8 కోట్లు,మురమళ్ల-ఐ.పోలవరం-ఎదుర్లంక రోడ్డుకు రూ.60 లక్షలు, ముమ్మిడివరం- ఐనాపురం-కాట్రేనికోన రోడ్డుకు రూ.3.9 కోట్లు, ముమ్మిడివరం-ముక్తేశ్వరం రోడ్డుకు రూ.2.15కోట్లు మంజూరయ్యాయి.

తూర్పుగోదావరి జిల్లాలో..

తూర్పుగోదావరి జిల్లాలో రాజమహేంద్రవరం-బొమ్మూరు-కేశవరం రోడ్డు అభివృద్ధికి రూ.3.50కోట్లకు మంజూరు చేశారు. జిల్లా రహదారుల్లో కడియం-జేగురుపాడు, కడియపులంక-పొట్టిలంక-వీరవరం రోడ్ల అభివృద్ధికి రూ.3.20 కోట్లు, కానూరు-గోపవరం, ఎన్‌హెచ్16వీవీ రోడ్డు-ఖండవిల్లి రహదారుల అభివృద్ధికి రూ.4.15 కోట్లు, దువ్వ-తేతలి మునిపల్లె రోడ్డుకు రూ4.15 కోట్లు, గోపాలపురం-కాటకోటేశ్వరం రోడ్డుకు రూ.4.35 కోట్లు, ఎన్‌వై రోడ్డు-కురుకురు-పల్లంట్ల-లక్ష్మీపురం-ఈజీకే రోడ్డుకు రూ.3.50 కోట్లు కేటాయించారు.ఈ నిధులతో వేగంగా రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. పనులకు టెండర్లు పిలిచేందుకు సన్నద్ధమవుతున్నారు.

రూ.3.49కోట్లతో జ్యోతుల పాపారావు నీటిపారుదల ప్రాజెక్టుకు శంకుస్థాపన

- పాల్గొన్న నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో రూ.3.49కోట్లతో జ్యోతుల పాపారావు నీటిపారుదల ప్రాజెక్టు శంకుస్థాపన చేశామని, తద్వారా 3500 ఎకరాలకు ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. జగ్గంపేటలోని పురుషోత్తపట్నం లిఫ్ట్ ఇరిగేషన్ పథకం స్టేజ్-2 పవర్ ప్రెషర్ మెయిన్ ద్వారా మామిడాడ ట్యాంకు నీటి సరఫరాకు జ్యోతుల పాపారావు లిఫ్ట్ ఇరిగేషన్ పథకం చేపట్టామని ఆదివారం ఆయన తెలిపారు. మంత్రి నిమ్మల జగ్గంపేట చేరుకోగానే కాకినాడ రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ కార్యకర్తలతో కలిసి బైక్ ర్యాలీగా జగ్గంపేట మండలం మామిడాడ గ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ పథకం ద్వారా మామిడాడ ట్యాంకుకు చేరే ఈ నీరు ఇక్కడినుంచి అనుసంధానమై కస్కిడ్ సిస్టం ద్వారా సీతారాముడు చెరువు, జగ్గవాని చెరువు, అచ్చన్నచెరువు వంటి కీలకమైన చెరువులన్నింటినీ నింపుతూ 3500 ఎకరాల శివారు ప్రాంత భూములకు అందించేందుకు ఉపయోగ పడుతుందని తెలిపారు. తాళ్లూరు లిఫ్ట్ ఇరిగేషన్ మరమ్మతులకు రూ.54కోట్లతో క్యాబినెట్‌లో ఆమోదం పొందిందని తెలిపారు. త్వరలోనే టెండర్లు పిలిచి పనులు చేపడతామన్నారు. తాళ్లూరు లిఫ్ట్ బాగు చేసి 30వేల ఎకరాలకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందిస్తామన్నారు.కాలువల మరమ్మతులకు రూ.5కోట్ల ఆపరేషన్ మేనేజ్మెంట్ కింద మంజూరు చేసి టెండర్లు పిలిచి డ్యామేజ్ అయిన పనులను పూర్తి చేస్తామన్నారు. గత ప్రభుత్వం ఇరిగేషన్‌శాఖకు రూ.18వేల కోట్లు బకాయిలు పెట్టిందని, వాటిని చెల్లిస్తామని తెలిపారు. పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ పనులు రూ.1200కోట్లతో చేపట్టామన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ రూ.3.49 కోట్లతో జ్యోతుల పాపారావు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును ప్రభుత్వం మంజూరు చేసిందని, దీనిద్వారా 3500 ఎకరాల శివారు భూములకు నీరు అందించేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు, జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్, ఇరిగేషన్‌శాఖ సీఈకే నరసింహమూర్తి, ఎస్ఈ డి.ఏసుబాబు, ఈఈ డి.శ్రీనివాసులు, డీఈ వి.ప్రసాద్‌రావు, జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్‌బాబు, పుష్కరప్రాజెక్టుకమిటీ చైర్మన్ అడబాల భాస్కరరావు, సూరంపాలెం ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ ఉంగరాల రాము, ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బస్వా వీరబాబు, ఎస్వీఎస్ అప్పలరాజు, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్తకొండ బాబు, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహనరావు, పార్టీ మండల అధ్యక్షుడు జీనుమణి బాబు, వీరం రెడ్డి కాశిబాబు, ఎంపీపీ తోట రవి పాల్గొన్నారు.

తరలెళ్లిపోతున్న పల్లె జనం

(మొదటి పేజీ తరువాయి)

50 నుంచి 100 కుటుంబాలకు పైగా ఇప్పటికే ఊరు వదిలి వెళ్లారు. ముఖ్యంగా తెలంగాణలోని మహబూబ్‌నగర్, వికారాబాద్ జిల్లాలకు, ఏపీలోని గుంటూరు జిల్లాకు వెళ్తున్నారు. మంత్రాలయం, ఎమ్మిగనూరు, ఆలూరు, ఆదోని, కోడుమూరు, పత్తికొండ నియోజకవర్గాల నుంచి ఇప్పటికే పది వేల కుటుంబాలు పొట్టచేత పట్టుకొని సుగ్గి బాటన సాగిపోయి ఉంటారని అనధికారిక అంచనా. దీంతో గ్రామాలన్నీ బోసిపోతున్నాయి. తల్లిదండ్రులతో పిల్లలు కూడా వెళ్లడంతో పాఠశాలల్లో హాజరు తగ్గిపోతోంది.



వలస వెళ్తున్న పిల్లలకు వీడ్కోలు పలుకుతున్న వృద్ధులు

కిలో పత్తి తీస్తే రూ. 15

కర్నూలు జిల్లాలో 5.62 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. అత్యధికంగా పత్తిసాగు చేసిన జిల్లాల్లో గుంటూరు తర్వాతి స్థానం దీనిదే. అయితే అధిక వర్షాలకు తేమ ఎక్కువై చెట్టుపైన కాయలు నల్లగా మారి కుళ్లిపోయాయి. ఉన్న అరకొర పత్తి చెట్టు పైనే మొలకలొచ్చి నేలపాలయింది. ఎకరాకు నాలుగైదు క్వింటాళ్లకు పైగా దిగుబడి రూపంలో నష్టపోయామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో పెద్ద రైతులు పత్తితీత పనులకు పిలిచినా రూ. 300-400 మించి కూలి ఇవ్వడం లేదు. ఆరు నెలలుగా ఉపాధి హామీ కూలి డబ్బులు అందకపోవడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారు. కుటుంబ పోషణ భారం అవుతుండటంతో వలసబాట పట్టారు. మహబూబ్‌నగర్, వికారాబాద్, గుంటూరులో కిలో పత్తి తీస్తే రూ. 15 నుంచి రూ. 18 చొప్పున ఇస్తున్నారు. 'దంపతులిద్దరూ రోజుకు వంద కిలోల పత్తి తీస్తే రూ. 1,500 వస్తుంది. ఇద్దరు పిల్లలు కూడా పనిలోకి వెళితే మరో రూ.వెయ్యి సంపాదించవచ్చు. ఇలా రోజుకు సుమారు రూ. 2,500, నెలంతా కష్టపడితే దాదాపు రూ.50 వేల నుంచి 60 వేలు సంపాదించుకోవచ్చని వలస బాట పట్టారు. గుంటూరు జిల్లాలో పత్తి తీత పనులు అయిపోగానే మిరప కోత పనులు మొదలవుతాయి. నాలుగైదు నెలలు పనులు ఉంటాయని ఆ జిల్లాకు ఎక్కువ వెళ్తున్నారు.

ఆ ప్రాజెక్టులు పూర్తి చేస్తేనే..

కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో వలసల నివారణే ప్రధాన లక్ష్యంగా 2019లో నాడు టీడీపీ ప్రభుత్వం వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. తుంగభద్ర నదిపై 20 టీఎంసీల సామర్థ్యంతో గుండ్రేవుల జలాశయం నిర్మాణానికి నిధుల మంజూరుకు ఉత్తర్వులు ఇచ్చింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పనులను అటకెక్కించింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రావడంతో ఈ ప్రాజెక్టులకు మోక్షం లభిస్తుందని రైతులు ఆశించినా ఇప్పటి వరకూ పనుల్లో కదలికలేదు. కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతం పల్లెసీమల వలసలకు అడ్డుకట్ట వేయాలంటే ఈ మూడు ప్రాజెక్టుల నిర్మాణమే ఏకైక పరిష్కార మార్గమని రాయలసీమ సాగునీటి నిపుణులు పేర్కొంటున్నారు.

ఆరెకరాలున్నా.. వలస బాటే

చింతకుంటకు చెందిన పుసులు యల్లప్ప, పద్మ దంపతులకు బోరుబావి కింద ఆరెకరాల పొలం ఉంది. 3 ఎకరాల్లో పత్తి, మరో 3 ఎకరాల్లో ఉల్లి సాగు చేశారు. రూ.4 లక్షలకు పైగా అప్పు చేశారు. ధరలు పతనమవడంతో ఉల్లి పంటను పొలంలోనే వదిలేశారు. అధిక వర్షాలకు పత్తికూడా పాడైపోయింది. పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక బడికి వెళ్లే ఇద్దరు పిల్లలను తీసుకొని వికారాబాద్‌కు వలస వెళ్తున్నానని యల్లప్ప చెప్పాడు.

యూజ్‌లెస్ ఫెలో.. ఎవడ్రా నువ్వు!

- ఎమ్మెల్యే బూర్లపై నోరు పారేసుకున్న మాల మహానాడు నేత గోళ్ల
- తురకపాలెం మృతుల కుటుంబాలకు చెక్కుల పంపిణీ

గుంటూరు(తూర్పు), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా ప్రత్తిపాడు ఎమ్మెల్యే, మాజీ ఐఏఎస్ అధికారి బూర్ల రామాంజనేయులును మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్ కుమార్ అసభ్య పదజాలంతో దూషించారు. తురకపాలెంలో వరుస మరణాల నేపథ్యంలో ఆదివారం ఆయా కుటుంబాలకు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఈ ఘటన జరిగింది. ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున మొత్తం 28మందికి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సమక్షంలో బాధితులకు ఎమ్మెల్యే చెక్కులు పంపిణీచేశారు. ఈ సాయం ప్రభుత్వం చేస్తోందని, దళారులు డబ్బులు అడిగితే ఇవ్వద్దని సూచించారు. ఆ సమయంలో అక్కడే ఉన్న అరుణ్ కుమార్ ఎమ్మెల్యేను చూస్తూ అంత దౌర్భాగ్యం తమకు రాలేదన్నారు. ఒక సమయంలో నియంత్రణ కోల్పోయి ఎమ్మెల్యే వైపు వేలు చూపిస్తూ 'ఎవడ్రా నువ్వు.. యూజ్ లెస్ ఫెలో' అంటూ దూషించడంతో పాటు తిట్లపర్వం అందుకున్నారు. ఈ ఘటనతో కేంద్ర మంత్రి, అధికారులు షాకయ్యారు. ఎమ్మెల్యే మీదకు దూసుకువచ్చిన అరుణ్‌కుమార్‌ను పోలీసులు తీసుకువెళ్లి పోయారు. ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాలమహానాడు నాయకులను గ్రామస్థులు అడ్డుకున్నారు. మా ఊళ్లో మీ పెత్తనం ఏమిటని నిలదీశారు. కాగా, కొందరు బాధితులు తమకూ ఆర్థిక సాయం ప్రకటించాలని కోరారు.



ఎమ్మెల్యే బూర్లకు వేలు చూపిస్తూ మాట్లాడుతున్న గోళ్ల అరుణ్‌కుమార్

డిజిటల్ ప్లంబింగ్‌తో విస్తృత పెట్టుబడులు

- బెంగళూరుతో పోటీ పడేలా విశాఖ అభివృద్ధి
- 'ఆంధ్రజ్యోతి'తో సిఫీ చైర్మన్ రాజు వేగేశ్న

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)



"డిజిటల్ ప్లంబింగ్"తో విశాఖపట్నానికి విస్తృత స్థాయిలో విదేశీ పెట్టుబడులు వస్తాయని సిఫీ టెక్నాలజీస్ చైర్మన్ రాజు వేగేశ్న తెలిపారు. రుషికొండ ఐటీ పార్కులో ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్‌కు ఆదివారం శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. విశాఖ కాస్మోపాలిటన్ నగరమని, ప్రస్తుతం ఐటీలో ద్వితీయ శ్రేణి (టైర్-2) నగరంగా ఉందని, త్వరలో ప్రథమ శ్రేణి నగరాలతో పోటీ పడుతుందని చెప్పారు.

ప్రశ్న: డిజిటల్ ప్లంబింగ్ అంటే..?

రాజు వేగేశ్న: సముద్రం అంతర్భాగం నుంచి తీసుకువచ్చే సబ్‌మెరైన్ కేబుళ్లతో విశాఖలోని సిఫీ ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్‌ను అనుసంధానం చేస్తాం. ప్రపంచంలో ఎక్కడెక్కడో ఉన్న సమాచారాన్ని ఇక్కడికి తీసుకొస్తాం. అవసరమైన రాష్ట్రాలకు, దేశాలకు పంపిస్తాం. ఇలా డేటాని పంపింగ్ చేయడాన్ని 'డిజిటల్ ప్లంబింగ్'గా వ్యవహరిస్తాం. ఇందులో విశాఖ అగ్రస్థానంలో నిలవనుంది. డిజిటల్ ప్లంబింగ్ వల్ల మరిన్ని డేటా సెంటర్లు వస్తాయి. త్వరలోనే ఒక గిగావాట్, రెండు గిగావాట్ సామర్థ్యం కలిగిన డేటా సెంటర్లు ఏర్పాటవుతాయి. విదేశీ పెట్టుబడులు వస్తాయి. ఎకో సిస్టమ్ అభివృద్ధి చెందుతుంది.

భారీగా ఉద్యోగాలు వస్తాయా?

ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలు ఎలాగైతే ఇంజనీర్లను, డాక్టర్లను తయారు చేసి సమాజానికి అందిస్తున్నాయో.. డేటా సెంటర్లు కూడా ఆ విధంగానే పనిచేస్తాయి. వీటి వల్ల ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు తక్కువగా ఉన్నా.. పరోక్షంగా ఎకో సిస్టమ్ అభివృద్ధి చెంది పెద్ద ఎత్తున ఉపాధి లభిస్తుంది. ఐటీలో అగ్రస్థానంలో ఉన్న బెంగళూరుతో పోటీ పడేలా విశాఖ ఎంతో అభివృద్ధి సాధిస్తుంది.

ఈ రంగంలో మీకున్న అనుభవం ఏమిటి?

భారత్‌లో 25ఏళ్ల క్రితమే డేటా సెంటర్లను సిఫీ ప్రారంభించింది. ముంబైలో 250 మెగావాట్లు, నోయిడాలో 130 మెగావాట్లు, చెన్నైలో మరో 130 మెగావాట్ల డేటా సెంటర్లు నిర్వహిస్తున్నాం. నాస్డాక్‌లో నమోదైన రెండు కంపెనీల్లో ఒకటి ఇన్ఫోసిస్ అయితే రెండోది సిఫీ. డేటా సెంటర్ ఆపరేషన్లు రెండేళ్లలో ప్రారంభించాలనే లక్ష్యంతో విశాఖ వచ్చాం. నేనూ ఏపీకి చెందినవాడినే. మంత్రి లోకేశ్ చాలాకాలం నుంచి తెలుసు. విశాఖ కాస్మోపాలిటన్ నగరం. ఇక్కడ అన్ని ప్రాంతాల వారు ఎటువంటి భేదభావాలు లేకుండా కలిసి మెలిసి ఉంటారు. ఇక్కడ అందమైన బీచ్‌లు ఉన్నాయి. పర్యాటకంగా అభివృద్ధి చెందుతోంది. వీటన్నింటి కంటే మంచి పాలసీలు, పూర్తి సహకారం అందించే ప్రభుత్వం ఉండటం వల్లనే ముందుకొచ్చాం.

హైదరాబాద్‌కు దీటుగా విశాఖ

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. అనంతరం రుషికొండ ఏ-1 కన్వెన్షన్ సెంటర్‌లో సిఫీ ప్రతినిధులు ఏర్పాటు చేసిన సమావేశాన్ని లోకేశ్ జ్యోతి వెలిగించి ప్రారంభించి, ప్రసంగించారు. గత 17 నెలల్లో రాష్ట్రానికి 120 బిలియన్ డాలర్ల పెట్టుబడులు రాగా అందులో 50శాతానికి పైగా విశాఖ జిల్లాకే వచ్చాయని తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులు భారీగా రావడం ఇదే మొదటిసారని, ఇదంతా ఒక్కరోజులో సాధ్యం కాలేదని చెప్పారు. సుదీర్ఘ చర్చలు, అనేక మంది కీలకంగా వ్యవహరించడం వల్లనే వచ్చాయన్నారు. సిఫీ సంస్థను ఏపీకి రప్పించడానికి ఎనిమిదేళ్లు పట్టిందన్నారు. రాష్ట్రానికి విశాఖపట్నమే ఆర్థిక రాజధాని అని, అభివృద్ధి విషయంలో వికేంద్రీకృత విధానం అనుసరిస్తున్నామని చెప్పారు. ఈ ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అందులో ఒక్క విశాఖలోనే 5లక్షల ఐటీ ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తున్నామని వెల్లడించారు. టీసీఎస్‌కు ఎకరా భూమి 99 పైసలకే ఇస్తే విమర్శించారని, అయితే ఆ నిర్ణయం కారణంగా కాగ్నిజెంట్, యాక్సెంచర్, ఏఎన్ఎస్ఆర్, సత్వాల్, గూగుల్ వంటి పెద్ద సంస్థలు విశాఖకు వచ్చాయన్నారు. పెట్టుబడుల విషయంలో ఏపీ ఇప్పుడు పొరుగు రాష్ట్రాలతోనే కాకుండా ఇతర దేశాలతో కూడా పోటీ పడుతోందని చెప్పారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల(జీసీసీ) కేంద్రంగా ఏపీని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఏ జీసీసీ అయినా ఏపీకే రావాలన్నారు.

బుల్లెట్ ట్రైన్ వేగం

ఏపీలో ఉన్నది డబుల్ ఇంజన్ సర్కారు మాత్రమే కాదని, బుల్లెట్ ట్రైన్ వేగంతో దూసుకుపోయే ప్రభుత్వమని లోకేశ్ అభివర్ణించారు. ఎవరైనా పెట్టుబడులు పెట్టడానికి ఢిల్లీ వెళితే... ఏపీకి వెళ్లాలని, అక్కడ వేగంగా నిర్ణయాలు తీసుకునే ప్రభుత్వం ఉందని సూచిస్తున్నారని, అది రాష్ట్రానికే గర్వకారణమని అన్నారు. రైల్వే జోన్ సాధించుకున్నామని, విశాఖ స్టీల్ ప్లాంటు కష్టాల్లో ఉంటే కేంద్రం రూ.11,440 కోట్లు ఇస్తే రాష్ట్రం రూ.4 వేల కోట్ల సాయం అందిస్తోందని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో స్టీల్ ప్లాంటు ఒక్క బ్లాస్ట్ ఫర్నేస్‌తో నడిస్తే ఇప్పుడు 3 బ్లాస్ట్ ఫర్నేసులతో 85% ఉత్పత్తి చేసే స్థాయికి చేరిందని తెలిపారు. మరో 3 నెలల్లో విశాఖకు మరిన్ని పెట్టుబడులు వస్తాయని చెప్పారు. విశాఖ అభివృద్ధికి రాష్ట్ర మంత్రివర్గం బ్లాంక్ చెక్ ఇచ్చిందని, దాంతో దూకుడుగా వెళ్తున్నామని చెప్పారు. ఈ ప్రాజెక్టుకు సిఫీ రూ.1,500 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. వెయ్యి మందికి ఉపాధి లభిస్తుంది. తొలిదశలో 50 మెగావాట్ల సామర్థ్యం కలిగిన డేటా సెంటర్ ఏర్పాటు చేస్తారు.



సిఫీ ఏఐ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేస్తున్న లోకేశ్

4 జిల్లాలతో గ్రేటర్ విశాఖ ఎకనమిక్ జోన్: లోకేశ్

ఉత్తరాంధ్రలో శ్రీకాకుళం నుంచి అనకాపల్లి వరకు 4 జిల్లాలతో 'గ్రేటర్ విశాఖ ఎకనమిక్ జోన్' ఏర్పాటు చేస్తున్నామని మంత్రి లోకేశ్ వెల్లడించారు. ఆదివారం విశాఖ కలెక్టరేట్‌లో మీడియాతో మాట్లాడారు. 'మహా విశాఖ ఆర్థిక మండలి' నిర్వహణ, విధివిధానాలపై సీఎం ప్రకటన చేస్తారని చెప్పారు. పరిశ్రమలు పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించే నాటికి రోడ్లు, ఇతర వసతులు కల్పించాలని ఆదేశించారు. ఉత్తరాంధ్రలో ఏర్పాటుకానున్న పరిశ్రమలు, కంపెనీల ద్వారా 5లక్షల మందికి ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. రాష్ట్రానికి వచ్చిన రూ.లక్ష కోట్ల పెట్టుబడుల్లో సగం గ్రేటర్ విశాఖ ఎకనమిక్ జోన్‌కు వచ్చాయన్నారు. 2047 నాటికి రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయాలంటే గ్రేటర్ జోన్ ఆర్థిక వృద్ధి ట్రిలియన్ డాలర్లకు చేరుకోవాలన్న లక్ష్యంతో ప్రణాళికలు రూపొందించామని వివరించారు. వచ్చేనెల 14, 15ల్లో విశాఖలో జరగనున్న పెట్టుబడుల సదస్సులో మరిన్ని కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుంటామన్నారు. మంగళవారం సీఎం చంద్రబాబు ఢిల్లీ వెళ్లి గూగుల్‌తో ఒప్పందం కుదుర్చుకోనున్నారని చెప్పారు. గూగుల్ సంస్థ ద్వారా దేశంలో అతిపెద్ద విదేశీ పెట్టుబడి ఇదేనన్నారు. టీసీఎస్‌కు కేటాయించిన భూముల్లో వచ్చే నెలలో శంకుస్థాపన జరుగుతుందని చెప్పారు. డిసెంబరులో కాగ్నిజెంట్ ప్రాజెక్టు శంకుస్థాపనకు సీఈవో వస్తున్నారని తెలిపారు. దేశంలో అతిపెద్ద ఉక్కు పరిశ్రమ ఉమ్మడి విశాఖలో ఏర్పాటుకాబోతున్నదన్నారు.

బ్రహ్మాండంగా బ్రహ్మోత్సవాలు..

- వాడపల్లి వెంకన్న సన్నిధిలో మహాసుదర్శన హోమం
- వైభవంగా తోమాల సేవ
- ఆకట్టుకున్న ప్రదర్శనలు



హనుమత్ వాహనంపై విహరిస్తున్న శ్రీవారు

ఆత్రేయపురం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు మూడో రోజు ఆదివారం బ్రహ్మాండంగా నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు పాల్గొని తరించారు. ఉదయం స్వామివారిని వసంత మండపంలో సర్వాంగ సుందరంగా అలంకరించిన వేదిక వద్దకు తోడ్కొని వచ్చి వైఖానస శాస్త్ర ప్రకారం ఖండవల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపడింతులు, అర్చకులు బ్రహ్మోత్సవ పూజలను నిర్వహించారు. ఉదయం 9.10 గంటలకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనము, పంచామృత మండపారాధన, మహాసప్నసము, హోమములు, దుష్టగ్రహ పరిహారార్థం మహాసుదర్శన హోమం, వేదమంత్రాల సాక్షిగా నిర్వహించారు. అనంతరం మేళతాళ మంగవాయిద్యాలతో తోమాల ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు. అనంతరం స్వామివారికి సమర్పించి తోమాల సేవను నిర్వహించారు. కేరళవాయిద్యాలు, కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సాయంత్రం స్వస్తివచనం ప్రధాన హోమములు, విశేష అర్చన, చతుర్వేద స్వస్తి తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, డిప్యూటీ కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు దంపతులు పాల్గొన్నారు. మిరుమిట్లు గొలిపే విద్యుత్‌శోభగుల నడుమ శ్రీవారు కోదండరామ అలంకరణలో అలంకృతుడై హనుమత్‌వాహనంపై తిరువీధుల్లో వివిధ కళాకారుల ప్రదర్శనల నడుమ విహరించి కృపాకటాక్షాలు అందించారు.

నేడు..

వాడపల్లిలో స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గో రోజు సోమవారం యోగ నార సింహ అలంకరణలో శ్రీవారి సింహవాహన సేవ తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నారు.



ఉత్సవమూర్తులకు మహాసప్నసము దృశ్యం



మహిళా కళాకారుల వాయిద్య ప్రదర్శన

బాణసంచా పేలుడు ఘటనలో పదికి చేరిన మృతుల సంఖ్య

- చికిత్స పొందుతూ మరో ఇద్దరి మృతి
- తమకు న్యాయం చేయాలంటూ అనపర్తిలో బంధువుల ఆందోళన



యామిని (ఫైల్)



వెంకటకృష్ణ (ఫైల్)

అనపర్తి/ రాయవరం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం విసావరం గ్రామ పరిధిలో గణపతి ఫైర్ వర్క్సులో ఈనెల 8న జరిగిన అగ్ని ప్రమాదంలో ఆదివారం నాటికి మృతుల సంఖ్య పదికి చేరుకుంది. సంఘటనలో ఆరుగురు సజీవ దహనం కాగా మరో నలుగురు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించగా అదే రోజు ఒకరు, మరుసటి రోజు ఒకరు, ఆదివారం మరో ఇద్దరు మృత్యువాత పడ్డారు. ప్రమాదం జరిగిన రోజు యజమాని వెలుగుబంట్ల సత్యనారాయణ, పాకా అరుణ, చిట్టూరి శ్యామల, పెంకే శేషారత్నం, కురుపూడి జ్యోతి, కె.సదానంద్ సజీవదహనం కాగా అదే రోజు ఆసుపత్రిలో పొట్నూరి వెంకటరమణ మృతి చెందగా మరుసటి రోజు వాసంశెట్టి విజయలక్ష్మి చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆదివారం చిట్టూరి యామిని (30), లింగం వెంకటకృష్ణ(22) చికిత్స పొందు తూ మృతి చెందారు. కాకినాడలో జీజీహెచ్‌లో అనపర్తికి చెందిన చిట్టూరి యామి ని మృతి చెందడంతో పోస్టుమార్టం అనంతరం అధికారులు అంబులెన్స్‌లో మృతదేహాన్ని అనపర్తికి తరలించారు. అయితే యామిని బంధువులు మృతదేహాన్ని కొమరిపాలెంలోని యజమాని ఇం టికి తరలించే ఆలోచన చేయడంతో పోలీసులు అంబులెన్స్‌ను రెండు జీపులతో వెంబడించారు. బలభద్రపురం వంతెన వద్ద కొమరిపాలెం వైపు అంబులెన్సను మలుపు తిప్పే ప్రయత్నం చేసినప్పటికీ పోలీసులు మృతదేహాన్ని అనపర్తిలోని యామిని ఇంటికి చేర్చారు. అంబులెన్స్ నుంచి మృతదేహాన్ని దించేది లేదంటూ ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి యామిని ఇంటికి అధి కారులను పంపించడమే కాకుండా ఫోన్‌లో యా మిని భర్త శ్రీనుతో మాట్లాడారు. ఇప్పటికే విచారణ కోసం కమిటీని నియమించడం జరిగిందని, 2,3 రోజుల్లో అక్స్‌గ్రేషియా ప్రకటన వెలువడుతుందని ఆందోళన చెందవద్దంటూ వివరించారు. యజమాని కుమారుడు చిట్టిబాబు కూడా శ్రీనుతో మాట్లాడటంతో మృతుల బంధువులు శాంతించారు. మృతదేహాన్ని అంత్యక్రియలకు తరలించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ పెదపూడి మండలం వేండ్ర గ్రామానికి చెందిన లింగం వెంకటకృష్ణ(22) ఆదివారం మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదిస్తున్న తీరు స్థానికులను కలచివేసింది.

తల్లీకూతూరు సాధించారిలా

- హైకోర్టు బార్ కౌన్సిల్‌లో తల్లీతనయలకు ఒకేసారి సభ్యత్వం



హైకోర్టు బార్ కౌన్సిల్‌లో ఒకేసారి సభ్యత్వం పొందిన తల్లీకూతుళ్లు

కాకినాడ/జీజీహెచ్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): తల్లి, తనయ ఇద్దరూ ఒకేసారి ఏపీ హై కోర్టు బార్ కౌన్సిల్‌లో న్యాయవాదులుగా పేర్లు నమోదు చేసుకున్న అరుదైన ఘటన కాకినాడలో జరిగింది. కాకినాడ రామారావుపేటకు చెం దిన మల్లిపూడి మెహెరానీ, ఆమె కుమార్తె లక్ష్మీ ఐశ్వర్య ఇద్దరూ న్యాయ విద్యనభ్యసించి.. న్యాయవాదులుగా హైకోర్టు బార్ కౌన్సిల్‌లో తమ పేర్లు నమోదు చేసుకున్నారు. మెహరానీకి చిన్నప్పటి నుంచీ చదువంటే ప్రాణం. న్యాయవాదిగా మారాలనేది ఆమె సంకల్పం. తొలుత బీఎస్సీ డిగ్రీ పూర్తి చేయాలనుకున్న ఆమెకు తల్లిదండ్రులు వివాహం చేయడంతో అది నెరవేరలేదు. వివాహం అనంతరం ఆమె భర్త జీవీవీ సత్యనారాయణ ప్రోత్సాహంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా బీఏ పూర్తి చేసింది. అనంతరం రాజీవ్‌గాంధీ లా డిగ్రీ కళాశాలలో మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సులో చేరి.. తన కలను నెరవేర్చుకుంది. తనకు ఇష్టమైన న్యాయవాది డిగ్రీ పట్టా పొందింది. ఇక మరోవైపు తల్లి మెమెరానీ లాగే తనయ లక్ష్మీ ఐశ్వర్య కూడా న్యాయవాద వృత్తినే ఎంచుకుంది. ఆమె ఒడిశాలోని నేషనల్ లా యూనివర్సిటీ నుంచి బీబీఏ ఎల్‌ఎల్‌బీ (ఆనర్స్) పూర్తి చేసి ప్రస్తుతం హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీలో ఎల్ఎ ల్ఎం చదువుతోంది. దీంతో తల్లీకుమార్తెలు ఇద్దరూ ఒకే రోజున రాష్ట్ర హైకోర్టు బార్ కౌన్సిల్‌లో సభ్యులుగా చేరారు. తన భర్త సత్యనారాయణ (ఏసీబీ సర్కిల్ ఇన్‌స్పెకర్), కుటుంబసభ్యుల సహకారంతో ఇది సాధ్యమైందని మెహరానీ 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. వారిని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, నాయకులు అభినందించారు.

పంచాయతీ ఉద్యోగులకు తీపి కబురు

- గ్రేడ్-1 కార్యదర్శులు 22 మందికి డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతి

సామర్లకోట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులకు డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతులు కల్పిస్తూ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ వీఆర్.కృష్ణ తేజ్ ఉత్తర్వులు జారీచేశారు. ఆదివారం జిల్లాకు చేరిన ఈ ఆదేశాల మేరకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో వివిధ పంచాయతీలలో గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులుగా పని చేస్తున్న 22 మంది అధికారులకు పదోన్నతులు కల్పించారు. వీరిని త్వరలో ఖాళీగా ఉన్న మండలాల్లో నియమించనున్నారు. ప్రస్తుతం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 16 డిప్యూటీ ఎంపీడీవో పోస్టులు ఖాళీగా ఉన్నట్టు సమాచారం. ఒకేసారి ఈ పోస్టులు భర్తీ కానున్నాయి. అలాగే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలకు కూడా పదోన్నతి బదిలీలు కానున్నాయి. దీంతో గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శుల ముఖాలలో దీపావళి కాంతులు ముందే రావడం విశేషం.

అనకాపల్లిలో యువతి కిడ్నాప్ చేబ్రోలులో బెదిరింపులు

- కారులో తిప్పుతున్న వ్యక్తులను పట్టుకున్న గొల్లప్రోలు పోలీసులు

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాలో యువతిని కిడ్నాప్ చేసి వివిధ ప్రాంతాల్లో కారులో తిప్పి కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో బెదిరిస్తుండగా పోలీసులు యువతిని, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం శ్రీరాంపురం గ్రామానికి చెందిన యువతి కర్రి వంశీ, మహమ్మద్ అల్తాఫ్ అనే ఇద్దరిని ప్రేమించింది. దీనిపై వారి మధ్య వివాదం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఈనెల 11న ఉదయం 11గంటల సమయంలో అల్తాఫ్ సదరు యువతిని రాజానగరం బీచ్ వద్దకు తీసుకువెళ్లారు. అక్కడి నుంచి అల్తాఫ్, వంశీ, వంశీ స్నేహితుడు రాజు ఆమెను బలవంతంగా కారులో ఎక్కించుకుని వివిధ ప్రాంతాల మీదుగా తిప్పుతూ అన్నవరం, కత్తిపూడి మీదుగా చేబ్రోలు శివారులోని మట్టిరోడ్డులోకి తీసుకెళ్లారు. ఎవరో ఒకరిని తేల్చుకోవాలంటూ యువతిని వారు కొట్టి బెదిరించారు. మళ్లీ సాంబ అనే మరో వ్యక్తితో యువతిని బెదిరించడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని యువతిని, బెదిరించిన వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. యువతి ఫిర్యాదుపై కిడ్నాప్ కేసు నమోదు చేసినట్టు గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా హాస్టళ్లలో సీసీ కెమెరాలు

- విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం : మంత్రి సవిత



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

రాజమహేంద్రవరం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా బీసీ హాస్టళ్లను మెరుగుపరిచే దిశగా చర్యలు వేగవంతం చేస్తున్నాం. ప్రతీ వసతిగృహం, గురుకుల పాఠశాలలో సీసీ కెమెరాలు, మినరల్ వాటర్ ప్లాంట్లు, ఇన్వర్టర్లు ఏర్పాటు చేస్తున్నాం. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత స్పష్టం చేశారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ హోటల్‌లో ఆదివారం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల బీసీ సంక్షేమ, చేనేత, జౌళి, లేపాక్షి శాఖల అధికారులతో ఆమె సమీక్షించారు. బీసీ వసతి గృహాల పరిస్థితిపై ఆరా తీశారు. సామాజిక బాధ్యతగా సీఎస్ఆర్ నిధులతో బీసీ హాస్టళ్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సదుపాయాలు నిరంతరం అందుబాటులో ఉంచాలన్నారు. దోమలు రాకుండా మెస్‌లను ఉంచాలని, వేడి చేసి చల్లార్చిన నీరు, తాజాగా వండిన ఆహారం మాత్రమే విద్యార్థులకు అందించాలన్నారు. విశ్రాంతి, తరగతి గదులు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలతో మాట్లాడుకోవడానికి క్వాయిన్ ఫోన్ సౌకర్యం కల్పించాలని ఆమె సూచించారు. మధ్యాహ్నం భోజన పథకం అమలు సక్రమంగా ఉండాలని, వసతి గృహాల్లోని విద్యార్థులను అధికారులు తమ పిల్లలుగా భావించి బాధ్యతగా చూడాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తరచూ గురుకుల పాఠశాలలు, వసతిగృహాలు సందర్శించి మధ్యాహ్న భోజన పథకం అమలు విధానం, పరిశుభ్రతను పరిశీలించాలన్నారు.

ఆప్కో లేపాక్షి విక్రయాల పెంపు

ఆప్కో, లేపాక్షి విక్రయాలు పెంచడానికి చర్యలు తీసుకుంటున్నామని.. ఇప్పటికే మార్కెట్‌లో ఆప్కో రెడీమేడ్ వస్త్రాలు సిద్ధంగా ఉన్నాయని మంత్రి తెలిపారు. మేక్ ఇండియా -మేడ్ ఇండియా దిశగా స్వదేశీ వస్తువులను ప్రజల్లోకి తీసుకుని వెళ్లి అలవాటు చేయాలన్నారు. తూర్పు గోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో పథకాల అమలు మరింత వేగవంతం కావాల్సి ఉందని చెప్పారు. ఈ ప్రాంతాల్లో 16 ఆప్కో షాపులు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారి, ఆంధ్రప్రదేశ్ బీసీ కో ఆపరేటివ్‌గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకటగురుమూర్తి, ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి బి.శశాంక, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్, ఆప్కో జీఎం కె.పెద్దిరాజు తదితరులు ఉన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

యానాం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): యానాంలో శనివారం జరిగిన దారుణ హత్య కేసులో నిందితుడిని ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం యానాంలో కాకినాడ జిల్లా కాజులూరు మండలానికి చెందిన తిప్పిరిశెట్టి నారాయణస్వామి (33) హత్యకు గురైన విషయం తెలిసిందే. హత్య ఘటనలో నిందితుడు మోకా ఆనందమూర్తి పరారీలో ఉండడంతో పట్టుకున్నామని యానాం సీఐ అడలరసన్ తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకుని విచారణ అనంతరం సాయంత్రం యానాం పోలీస్‌స్టేషన్‌లో మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఆనందమూర్తి తండ్రి మోకా వెంకటేశ్వరావు(57)ను గతంలో ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో చీటీల వ్యాపారి తిప్పిరిశెట్టి నారాయణస్వామి విచక్షణా రహితంగా దాడి చేయడంతో చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీంతో ప్రతీకారం తీర్చుకునేందుకు ఆనంద్‌మూర్తి నారాయణస్వామిని హత్య చేసినట్టు పోలీసులు తెలిపారు. హత్యకు ఉపయోగించిన కత్తితో పాటు మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకుని కోర్టులో ప్రవేశపెట్టారు. రిమాండ్ విధించడంతో ఆనంద్ మూర్తిని యానాం సబ్‌జైల్‌కు తరలించారు.

మరిడమ్మ దేవస్థానంలో అన్నదానం



పెద్దాపురం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మరిడమ్మ దేవస్థానంలో ఆదివారం సుమారు 400 మంది అన్నప్రసాదం స్వీకరించారని సహాయ కమిషనరు కె.విజయలక్ష్మి తెలిపారు. భవిష్యత్తులో నిత్యాన్నదానం నిర్వహణకు చర్యలు చేపడుతున్నట్టు ఆమె తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.



ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్‌కి క్రీడా మైదానం అభివృద్ధి ప్రణాళికను వివరిస్తున్న అధికారులు

క్రీడా మైదానం అభివృద్ధికి చర్యలు: ఎంపీ ఉదయ్

పిఠాపురం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానం అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఆయన జనసేన నాయకులు, అధికారులతో కలిసి క్రీడా మైదానాన్ని పరిశీలించారు. క్రికెట్, వాలీబాల్, ఖోఖో ఆడేందుకు అత్యాధునిక హంగులతో తీర్చిదిద్దుతామని చెప్పారు. వాకింగ్ ట్రాక్ నిర్మిస్తామన్నారు. క్రీడా మైదానం అభివృద్ధికి త్వరితగతిన అంచనాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఎంపీ వెంట జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, పాడా ఏపీడీ వసంతమాధవి ఉన్నారు.



వాసవికన్యకాపరమేశ్వరి ఆలయంలో నృత్య ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

పిఠాపురంలో అలరించిన బృంద నాట్యం

పిఠాపురం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాసవికన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం రాత్రి చిన్నారుల బృంద నాట్యం ఆహుతులను అలరించింది. పద్మశ్రీ శోభానాయుడు వర్ధంతి, నాట్య గురువు వెంపటి చినసత్యం మాస్టారి జయంతి సందర్భంగా శృతిలయ సంగీత కూచిపూడి నృత్యాలయం ఆధ్వర్యంలో కళాకారులు మహాలక్ష్మి అమ్మవారి ఆలయం నుంచి పాదయాత్రగా తరలివచ్చారు. కూచిపూడి దినోత్సవంగా పాటిస్తూ ఒకే వేదికపై 60 మంది చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శన ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. నాట్యాలయ నిర్వాహకులు కొత్త ప్రవీణ, విశ్వేశ్వరరావు, నాట్యాచార్యులు వీరభద్రరావు, భారత్ పబ్లిక్ స్కూలు అధినేత గట్టి శ్రీకృష్ణదేవరాయ తదితరులు పాల్గొన్నారు.



బౌద్ధ సదస్సు కరపత్రాలను ప్రదర్శిస్తున్న నాయకులు

కాకినాడలో 19న బౌద్ధ సదస్సు

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ అంబేడ్కర్ భవన్‌లో ఈ నెల 19న జరగనున్న బౌద్ధ సదస్సు కరపత్రాలను ఆదివారం అంబేడ్కర్ బుద్ధవిహార్‌లో ఆవిష్కరించారు. బుద్ధవిహార్ అధ్యక్షుడు డాక్టర్ కె.బాబ్జీ, సివిల్ సర్వీసెస్ మాజీ అధికారి పీఎస్ఎన్ మూర్తి (ఐడీఏఎస్-వీఆర్), సదస్సు కన్వీనర్ పి.రామారావు, సహ కన్వీనర్ డాక్టర్ కె.భానుమతి, కోశాధికారి పి.రాంప్రసాద్ ఆవిష్కరణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బౌద్ధ ధర్మ సందేశాన్ని ప్రజలకు విస్తృతంగా చేరవేయాలనే ఉద్దేశ్యంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే సదస్సులో పూజ్య భంతే అనాలయో, విశ్రాంత ఐపీఎస్ సి.ఆంజనేయ రెడ్డి, పురావస్తు శాఖ అధికారి డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి, ఎన్. సిద్ధోజీరావు, వై.సత్యనారాయణ, ఐపీఎస్ అధికారి మోకా సత్తిబాబు, బీఎస్ఐ అధ్యక్షుడు ఉపాసక జి.శ్రీరాములు ప్రసంగిస్తారన్నారు. కార్యక్రమంలో బుద్ధ విహార్ కార్యదర్శి డాక్టర్ కె.రామారావు, ఉపాధ్యక్షుడు డి.వెంకటరావు, బీఎస్ఐ కార్యదర్శి ఎన్.పెద్దిరాజు, బామ్‌సెఫ్ బాధ్యులు జి.కింగ్, ఎం.రమేష్, నూకరాజు, సుబ్బారావు మౌర్య, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానం ఆవరణలో బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యురాలు గీతామూర్తి

ఆలయాల్లో బీజేపీ నేత పూజలు

పిఠాపురం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యురాలు గీతామూర్తి ఆదివారం పిఠాపురం విచ్చేశారు. శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో శ్రీపాదశ్రీవల్లభుడు, దత్తాత్రేయస్వామి, నృసింహసరస్వతి, పాదగయ క్షేత్రంలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో ప్రపంచంలోనే ముందుండి స్వయం సమృద్ధి సాధించాలని ప్రార్థించినట్టు గీతామూర్తి తెలిపారు. ఆయా ఆలయాల అధికారులు ఆమెను శేషవస్త్రాలతో సత్కరించి స్వామి, అమ్మవార్ల ఫొటోలను అందజేశారు.

డీఎన్ఎఫ్ ఆధ్వర్యంలో గృహ నిర్మాణం

కాజులూరు (కరప), అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కాజులూరు మండలం ఆర్యవటంలో డేగల నాగేంద్ర ఫౌండేషన్ రూ.3లక్షలతో నిర్మించిన గృహాన్ని బందనపూడి గ్రామ సర్పంచ్ డేగల తిరుమలవేణి ఆదివారం ప్రారంభించి లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామానికి చెందిన కుందాల భవాని-లోవేశ్వరరావు దంపతులు అగ్నిప్రమాదంలో ఇల్లు కోల్పోయిన ఘటన కలచివేసిందన్నారు. స్థానిక బాబీ ఫ్రెండ్స్ యూత్ అధ్యక్షుడు చందాల బాబీ ద్వారా వారి దుస్థితిని తెలుసుకుని డీఎన్ ఫౌండేషన్ వెంటనే స్పందించిందన్నారు. యుద్ధ ప్రాతిపదికన గృహం నిర్మించి బాధిత కుటుంబానికి అప్పగించిన డీఎన్ఎఫ్ చైర్మన్ ఎన్ఆర్ఐ డేగల నాగేంద్రను అభినందించారు. నాగేంద్రను గ్రామస్తులు, లబ్ధిదారులు, సంస్థ సభ్యులు సత్కరించారు. డేగల సత్యనారాయణ, బాబీ ఫ్రెండ్స్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.



డీఎన్ఎఫ్ నిర్మించిన గృహాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ తిరుమలవేణి





కరప మండలం వేళంగిలో సమావేశమైన ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు, గ్రామస్తులు, గ్రాడ్యుయేట్స్ యూత్ సభ్యులు (పైన) పిఠాపురంలో జరిగిన ఆర్ఎస్ఎస్ శత జయంతి విజయదశమి కార్యక్రమంలో మాట్లాడుతున్న రాచకొండ ప్రసాద్

'దేశాభ్యున్నతిలో ఆర్ఎస్ఎస్ పాత్ర కీలకం'

కరప, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): దేశాభ్యున్నతి, హిందూ సమాజాన్ని సంఘటిత పరచడంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) పాత్ర కీలకమని సంఘ ప్రముఖులు పేర్కొన్నారు. మండలంలోని వేళంగిలో ఆదివారం సానా శ్రీను ఆధ్వర్యంలో ఆర్ఎస్ఎస్ 100 సంవత్సరాల విజయదశమి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ స్వదేశీ వస్తువులను వినియోగించేలా ప్రోత్సహించి మన ప్రతిభా పాటవాలను, శక్తియుక్తులను ప్రపంచానికి చాటిచెప్పేందుకు యువకులు ఆర్ఎస్ఎస్‌లో సభ్యులు కావాలని సూచించారు. గ్రామ పెద్దలు మెర్ల వీరయ్యచౌదరి, బొండా వెంకన్నరావు, యిళ్ల ఆదేశ్, నండూరి కృష్ణ, ఎన్.రామారావు, ఉంగరాల శ్రీనివాసరావు, ఈశ్వరరావు, గ్రాడ్యుయేట్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఏర్పడి శతవసంతాలు పూర్తయిన సందర్భంగా ఆర్ఎస్ఎస్ పిఠాపురం శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆదిత్య స్కూలులో ఆదివారం విజయదశమి ఉత్సవం నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ విశిష్టతను వక్తలు వివరించారు. ఆర్ఎస్ఎస్ గోదావరి విభాగ్ శారీరక్ ప్రముఖ్ రాచకొండ ప్రసాద్, గోదావరి విభాగ్ కుటుంబ ప్రబోధన్ సంయోజక్ పెమ్మరాజు సత్యరామచంద్రరావు, సుధాకర్, కిరణ్, కొండేపూడి శంకరరావు, అల్లవరపు నగేష్, పంద్రవాడ వెంకటరమణమూర్తి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





సామర్లకోట మండలం పి.వేమవరంలో జీఎస్టీపై ప్రచారం చేస్తున్న పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప, కాకినాడ రూరల్ గైగోలుపాడులో వ్యాపారికి అవగాహన కల్పిస్తున్న టీడీపీ కో-కోఆర్డినేటర్ ప్రభాకర్

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు మరింత ప్రయోజనం

సామర్లకోట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0తో ప్రజలకు మరింత ప్రయోజనం కలుగుతుందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పి.వేమవరం, కాపవరం గ్రామాల్లో వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. జీఎస్టీపై ముద్రించిన కరపత్రాలను మహిళలకు అందజేశారు. టీడీపీ నాయకులు నిమ్మకాయల రంగనాగ్, మునిరెడ్డి శ్రీరాములు, క్లస్టర్ ఇన్చార్జి తోట నాగభూషణం, మునిరెడ్డి రాంబాబు, చీకట్ల వెంకటేష్, పోతుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్ (ఆంధ్రజ్యోతి): పేద, మధ్య తరగతి వర్గాల వారికి జీఎస్టీ 2.0 ఎంతో మేలు చేస్తుందని టీడీపీ కాకినాడ రూరల్ కో-కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ) తెలిపారు. ఆదివారం రమణయ్యపేట శివారు పాత గైగోలుపాడు దుర్గాదేవి ఆలయం నుంచి సర్పవరం కూడలి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. జీఎస్టీ సేవింగ్స్‌పై వ్యాపారులు, ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టా ప్రకాష్‌గౌడ్, టీడీపీ నాయకులు రాందేవు సీతయ్యదొర, కొమ్ముజు నెహ్రూ, ఏటుకూరి నాగమణి, పలివెల త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

శాలివాహన సామాజికవర్గం అభ్యున్నతికి కృషి

రాష్ట్ర శాలివాహన ఫెడరేషన్ చైర్మన్ ఈశ్వర్



పెనుమర్తిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న శాలివాహన ఫెడరేషన్ చైర్మన్ ఈశ్వర్

సర్పవరం జంక్షన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): చేతి, కులవృత్తుల ప్రోత్సాహానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, శాలివాహన సామాజికవర్గం అభ్యున్నతికి పూర్తి సహకారం అందిస్తానని రాష్ట్ర శాలివాహన ఫెడరేషన్ చైర్మన్ పి.ఈశ్వర్ పేర్కొన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం ఆయన పెనుమర్తిలో శాలివాహన ఫెడరేషన్ డైరెక్టర్, టీడీపీ సీనియర్ నాయకుడు భీమాబత్తుల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. గ్రామంలో కులవృత్తిదారులు చేస్తున్న పనులను పరిశీలించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మట్టి కుండల తయారీపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్న తమకు మట్టి తవ్వుకునేందుకు స్థలం కేటాయించాలని కోరారు. ఈ విషయమై అధికారులతో మాట్లాడి అనువైన స్థలం కేటాయించేందుకు చర్యలు తీసుకుంటానని ఈశ్వర్ హామీనిచ్చారు. అనంతరం గ్రామస్తులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. మాచవరపు విజయకుమారి, సంఘ పెద్దలు పాల్గొన్నారు.



సామర్లకోట రైల్వే స్టేషన్లో మంత్రి కేశవ్‌కి స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు

ఆర్థిక శాఖ మంత్రి

పయ్యావులకు స్వాగతం

సామర్లకోట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో ఆదివారం సామర్లకోట రైల్వే స్టేషన్‌కు చేరుకున్న రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు టీడీపీ నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీష్‌మోహన్ ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శి, కాకినాడ జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వల్లూరి సూర్యప్రకాశరావు (సూరిబాబు) మంత్రికి పుష్పగుచ్ఛం ఇచ్చి సాదర స్వాగతం పలికారు. అనంతరం మంత్రి పయ్యావుల ఆయన వియ్యంకుడు పట్టాభి ఆగ్రోఫుడ్స్ అధినేత స్వగృహానికి తరలివెళ్లారు. కార్యక్రమంలో బలుసు శ్రీనివాసు, దేవళ్ల జయలక్ష్మి, గుడాల శంకర్, ఎండీ సైపుల్లా, వగ్రే రవి, మలిరెడ్డి దుర్గాప్రసాద్, రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ ఎం.రమేష్, డీఎస్పీ శ్రీహరిరాజు, సీఐ కృష్ణభగవాన్ తదితరులు పాల్గొన్నారు.

'ఏలేరు'కు జలకళ

ఏలేశ్వరం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏలేరుజలాశయంలో నీటి నిల్వలు స్వల్పంగా పెరుగుతున్నాయి. గోదావరి జలాలతో పాటు మోస్తరు వర్షాలతో రిజర్వాయర్‌లో నీరు పెరుగుతోంది. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం నుంచి గోదావరి జలాలు 525 క్యూసెక్కులు ఏలేరు జలాశయానికి విడుదలవుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని రీతిలో 86.56 మీటర్ల స్థాయిలో 24.11 టీఎంసీల నీటిని నిల్వ చేసే అవకాశం ఉంది. 84.92 మీటర్ల స్థాయిలో 20.84 టీఎంసీల నిల్వలున్నాయని అధికారులు తెలిపారు.



సూర్యారావుపేటలో సంతకం చేస్తున్న కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు

ఓట్ల చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ సంతకాల సేకరణ

సర్పవరం జంక్షన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఓట్ల చోరీకి వ్యతిరేకంగా బీజేపీపై కాంగ్రెస్ చేపట్టిన సంతకాల సేకరణలో ప్రజలు భాగస్వాములు కావాలని కేంద్ర మాజీ మంత్రి ఎంఎం పళ్లంరాజు కోరారు. ఆదివారం కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేటలో ఆయన సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఓటు హక్కు రక్షణ, చోరీపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందం, కాకినాడ రూరల్ కో-ఆర్డినేటర్ పిల్లి సత్యలక్ష్మీచిన్న, పీసీసీ ప్రధాన కార్యదర్శి మల్లిపూడి రాంబాబు, దాట్ల గాంధీరాజు, దవులూరి ధనకోటి, తాళ్లూరి రాజు, సూరాడ రమణ, వనం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట భీమేశ్వరాలయంలో

కార్తీక మాస ఉత్సవాలకు ఏర్పాట్లు

కోనేరు పుష్కరిణిలో పాత నీరు తొలగింపు

సామర్లకోట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పంచారామ క్షేత్రమైన సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో ఈ నెల 22న ప్రారంభం కానున్న కార్తీక మాసోత్సవాలకు ఏర్పాట్లను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. పుష్కరిణిలో నిల్వ ఉండి రంగు మారిన నీటిని ఇంజన్ల సాయంతో పూర్తిగా తోడించారు. ఈ నెల 16 నాటికి పుష్కలంగా నీటిని నింపేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఆలయ ఆవరణ, గోపురాలు, శిఖరాలు, ఆలయానికి వచ్చే రెండు ప్రధాన మార్గాల్లో విద్యుద్దీపాలకరణ పనులు జరుగుతున్నాయి. కోనేరు పుష్కరిణి, గోదావరి పుష్కరిణి వద్ద లైట్లు ఏర్పాటు చేయడం ద్వారా తెల్లవారుజాము సమయాల్లో భక్తులు స్నానమాచరించేటప్పుడు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ఆలయం తెరిచే సమయం నుంచీ నిత్యాన్నదాన భోజనం ప్రారంభించే వరకు భక్తులకు ఆలయ ఆవరణలో పులిహోర ప్రసాదం పంపిణీ చేయాలంటున్నారు.



కోనేరు పుష్కరిణిలో నీటిని తొలగిస్తున్న దృశ్యం

15 నుంచి నిరవధిక సమ్మె

విద్యుత్ కార్మికుల సంఘ ప్రతినిధుల వెల్లడి

సామర్లకోట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 15 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నట్టు విద్యుత్ కార్మికుల సంఘ ప్రతినిధులు తెలిపారు. నాయకుడు వీరనాగు విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ ఔట్ సోర్సింగ్ దళారీ వ్యవస్థను పూర్తిగా రద్దు చేసి నేరుగా వేతనాలు చెల్లించాలన్నారు. 2022 పీఆర్సీ పెండింగ్ వేతనాల బకాయిలు చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే చెల్లించాలని, జేఎల్ఎం గ్రేడ్-2 లైన్‌మెన్‌లను విద్యుత్ శాఖలో విలీనం చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఈ డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. సోమవారం 'చలో విజయవాడ' జరుపుతామని అప్పటికీ యాజమాన్యం దిగిరాకపోతే 14న వర్క్ టు రూల్ పేరిట నిరసన తెలుపుతామన్నారు. 15వ తేదీ ఉదయం 6 గంటల నుంచి విద్యుత్ కార్మికులందరూ నిరవధిక సమ్మెలోకి వెళ్తారన్నారు. పెద్దాపురం డివిజన్ విద్యుత్ కార్మిక యూనియన్ అధ్యక్షుడు కోలా బాబీ పిలుపు మేరకు అన్ని డివిజన్ల పరిధిలో విద్యుత్ కార్మికులు 'చలో విజయవాడ'కు సన్నద్ధమయ్యారని వీరనాగు చెప్పారు.

'సమస్యలు పరిష్కరించకుంటే

ఆందోళన'

పిఠాపురం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 3వ వార్డులో నెలకొన్న సమస్యలను తక్షణం పరిష్కరించని పక్షంలో ఆందోళన చేపడతామని సీపీఎం కార్యదర్శి కుంచే చిన్నా, 2, 3, 4 వార్డుల సమస్యల పోరాట కమిటీ కన్వీనర్ కరణం విశ్వనాథం హెచ్చరించారు. వార్డులోని వివిధ ప్రాంతాల్లో గృహాల మధ్య నిలిచిపోయిన మురుగు, వర్షపునీటిని, డ్రైన్లలో పేరుకుపోయిన పూడికను, అధ్వాన రహదారులను వారు ఆదివారం పరిశీలించారు. బండి కృష్ణమూర్తి, గౌతు వెంకటరమణ, వెంకటేశ్వరరావు, రేగులగడ్డ శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మణరావును అభినందిస్తున్న తేజస్విని

ఆర్చరీ కోచ్‌ల కమిటీ రాష్ట్ర

వైస్ చైర్మన్‌గా లక్ష్మణరావు

పిఠాపురం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ కోచ్‌ల కమిటీ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా పిఠాపురం పట్టణానికి చెందిన ఆర్చరీ కోచ్ పి.లక్ష్మణరావు నియమితులయ్యారు. విశాఖపట్నంలోని రాయల్ పోర్టు హోటల్‌లో ఆర్చరీ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. ఆర్చరీ క్రీడాభివృద్ధికి లక్ష్మణరావు చేస్తున్న కృషికి గుర్తింపుగా వైస్ చైర్మన్‌గా నియమిస్తున్నట్టు ప్రకటించారు. ఆయన్ను అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు తేజస్విని అభినందించారు. ఆర్చరీలో జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో సత్తా చాటేలా క్రీడాకారులను తీర్చిదిద్దాలని సూచించారు.



డాక్టర్ దొరస్వామినాయక్‌ను సన్మానిస్తున్న అతిథులు, సంఘ ప్రముఖులు

ఏఐబీఎస్ఎస్ ఉపాధ్యక్షుడిగా

దొరస్వామినాయక్

జేఎన్టీయూకే, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత బంజారా సేవా సంఘం రాష్ట్ర కమిటీలో కాకినాడ జేఎన్టీయూ గ్రంథాలయ శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ బీఆర్ దొరస్వామి నాయక్‌కు చోటుదక్కింది. విజయవాడ గవర్నర్‌పేటలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సంఘ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం జరిగింది. దొరస్వామినాయక్ ఉపాధ్యక్షుడిగా ప్రమాణం చేశారు. కార్యక్రమంలో మాజీ డీఐజీలు జగన్నాథరావునాయక్, డీఎల్ రవీంద్రనాయక్, సంఘ అధ్యక్షుడు చక్రేనాయక్, సాధారణ కార్యదర్శి రాంబాబునాయక్, నూతన కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్

తాళ్లరేవు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలను నడపరాదని, ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ కోరారు. ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు ఆదివారం పోలేకుర్రు చెక్‌పోస్టు, కోరింగ పోలీసు స్టేషన్ వద్ద జాతీయ రహదారిపై డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. వాహనచోదకులను పరిశీలించి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై ఇ-చలానా నమోదు చేశారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించే వారిని ఉపేక్షించేది లేదన్నారు.

అన్నమయ్య చిన్నారుల వికాస తరగతులు

ప్రత్తిపాడు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో ఆదివారం అన్నమయ్య చిన్నారుల సర్వతోముఖ వికాస తరగతులు నిర్వహించారు. సంగన వెంకటేశ్వరరావు, చిరంజీవిల ఆధ్వర్యంలో స్థానిక పట్టాభిసీతా రామ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దిడ్డి రాజేష్, గొడే శేఖర్, కొల్లా బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ఒకదాని పక్కనే మరొకటి!

● చింతలగూడెం వద్ద రహదారిపై దిగబడిన రెండు ఇసుక లారీలు
● పది కిలోమీటర్ల మేర నిలిచిపోయిన ట్రాఫిక్ జామ్



నిలియిపోయి ఉన్న లారీలు

ఎటపాక, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): చింతలగూడెం వద్ద భద్రాచలం - చర్ల అంత రాష్ట్ర రహదారిపై రెండు ఇసుక లారీలు దిగబడిపోయాయి. శని వారం మధ్యాహ్నం సమయంలో గుంతలో ఒక లారీ కూరుకుపోగా, అదే రోజు రాత్రి మరొక లారీ పక్క పక్కనే దిగబడిపోయింది. దీంతో శనివారం రాత్రి నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు భారీ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఎటపాక నుంచి తెలంగాణలోని దుమ్ముగూడెం మండలం తూరుబాక వరకు సుమారు పది కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయ్యింది. ద్విచక్ర వాహనాలు, ప్యాసింజర్ ఆటోలు మినహా మరే ఇతర భారీ వాహనాలు రాకుండా పోయింది. ఎట్టకేలకు పోలీసులు స్పందించి క్రేన్ సాయంతో ఇసుక లారీలను పక్కకు తీయడంతో సమస్య తీరింది.

నేడు 'చలో రంపచోడవరం'

దేవీపట్నం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ఆదివాసీ డీఎస్సీ ప్రకటించాలని, ఆదివాసీ హక్కులు, చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని సోమవారం తలపెట్టిన 'చలో రంపచోడవరం ఐటీడీఏ' కార్యక్రమానికి ఆదివాసీలంతా తరలిరావాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ పిలుపునిచ్చారు. సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు అరకులో నిరుద్యోగులకు 100 శాతం ఉద్యోగాలను స్థానిక ఆదివాసీ నిరుద్యోగులతో భర్తీ చేస్తామని ఇచ్చిన హామీని ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ (టీఏసీ) ద్వారా తీర్మానం చేసి షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం ప్రకటించాలన్నారు.

ఆగిన 'సత్యసాయి' మంచినీటి సరఫరా

దేవీపట్నం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి మంచినీటి పథకం ఫిల్టరైజేషన్ ప్రక్రియలో ఆలం అయిపోవడంతో నాలుగు రోజులుగా మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గతంలో సత్యసాయి మంచినీటి పథకం కార్మికులు తమ పెండింగ్ జీతాల కోసం 35 రోజులు సమ్మె చేసినా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. అయినప్పటికీ ప్రజలకు మంచినీటి సరఫరా ఆగకూడదని సిబ్బంది ఏదో ఒకరకంగా నెట్టుకొస్తున్నారు. అయితే మూలిగేనక్కపై తాటిపండు పడిన చందాన ఇప్పుడు ఆలం అయిపోవడంతో మంచినీటి సరఫరాకు మళ్లీ అంతరాయం ఏర్పడింది. దీనికి మరమ్మతులు చేద్దామన్న బిల్లులు పెడితే రావేమోనని కాంట్రాక్టర్లు ముందుకు రావట్లేదు. సంబంధిత శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ దృష్టిపెట్టి కార్మికులకు జీతాలు, పెండింగ్‌లో ఉన్న బిల్లులను త్వరితగతిన చెల్లించి ప్రజలకు మంచినీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పెద ఆర్కూర్‌లో వైద్యశిబిరం

కూనవరం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్ఎస్ స్థాపించి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మండలంలోని పెద ఆర్కూర్‌లో సేవా భారతి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బందితో పాటు బీజేపీ నాయకులు పాయం వెంకయ్య, ఉపాధ్యాయులు రామారావు, సాయి, వెంకటేశ్వర్లు, వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లపై విరిగిపడ్డ చింతచెట్టు

చింతూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏజీ కోడేరులో చింతచెట్టు విరిగి పడడంతో రవ్వ రాములమ్మ, బీరబోయిన సీతమ్మకు చెందిన ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

నేటి నుంచి పంట నష్టం సర్వే

చింతూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సోమవారం నుంచి పంట నష్టం సర్వే చేపట్టనున్నట్టు మండల వ్యవసాయ అధికారి రత్నప్రభ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఏజీ కోడేరు, కుమ్మూరు, కల్లేరు, గూడూరు, చింతూరు, చదలవాడ, చిడుమూరు, ఏడుగురాళ్ళపల్లి, తుమ్మల, పేగ, ముకునూరు గ్రామాల్లో అధికారులు పర్యటించి నష్టాన్ని అంచనా వేస్తారు.

ఎర్రంపేటలో ఆకాశాన్ని తాకుతున్న అక్రమ కట్టడాలు

చింతూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎర్రంపేటలో అక్రమ కట్టడాలు ఆకాశాన్ని తాకుతున్నాయని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 1/70 చట్టానికి విరుద్ధంగా గిరిజనేతరులు బహుళ అంతస్తులు కట్టుకోవడానికి ఎన్‌వోసీ ఎవరు ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. ప్రస్తుతం ఎర్రంపేటలో నిర్మితమవుతున్న భవనం సర్వే నెం.22 పరిధిలోని ప్రభుత్వ భూమి అన్నారు. గతంలోనే చింతూరు, ఎర్రంపేటలలో 250 ఇళ్లు అక్రమంగా కట్టారని తేల్చిన అధికారులు మరలా నిర్మాణాలు జరుగుతుంటే ఎందుకు నిమ్మకుం టున్నారన్నారు. ముడుపులు అందడంతోనే నిర్మాణాలకు తెరచాటు అనుమతి ఇస్తున్నారని శ్రీను ఆరోపించారు.

30 మంది గిరిజన రైతులకు సోలార్ దీపాలు

మోతుగూడెం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మోతుగూడెం పంచాయతీ పరిధిలోని నాలుగు గ్రామాల్లో 30 మంది గిరిజన రైతులకు సోలార్ విద్యుద్దీపాలు అందించారు. ఈ సందర్భంగా ఆశా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి సుభానీ మాట్లాడుతూ ఈ లైట్లు ఇంటిలోను, రాత్రిపూట పొలాలకు వెళ్లే సమయంలోను ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. సంస్థ సంయుక్త కార్యదర్శి జె.వెంకటేష్, వలంటీరు అందాల రమణారెడ్డి పాల్గొన్నారు

సమస్యల పరిష్కారానికి చర్యలు : జమాల్‌ఖాన్

మోతుగూడెం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మోతుగూడెం పంచాయతీ టీడీపీ క్యాడర్‌తో ఆ పార్టీ చింతూరు మండల శాఖ అధ్యక్షుడు జమాల్‌ఖాన్ సమావేశమయ్యారు. మీ పంచాయతీ పరిధిలోని సమస్యలను తెలిపితే వాటిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీ కార్యాలయం వీధిలోని 20 కుటుంబాలు వారు ఆదివారం జమాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్ట్‌కి వినతిపత్రం అందజేశారు. తమకు సంవత్సర కాలంగా మంచినీళ్లు లేక కిలోమీటర్ దూరంలో ఉన్నటువంటి రామాలయం వద్దకు వెళ్లి తెచ్చుకుంటున్నామన్నారు. సమస్య తీర్చమని పలుమార్లు పంచాయతీ అధికారులకు, పత్రికల ద్వారా విన్నవించినా పరిష్కారం కాలేదన్నారు. దీనికి జమాల్‌ఖాన్ వెంటనే స్పందించి 10, 15 రోజుల్లోగా బోరు వేయించి మంచినీటి సౌకర్యం కల్పిస్తానని హామీనిచ్చారు.

ఎస్.రామన్నపాలెంలో అవగాహన సదస్సు

దేవీపట్నం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎస్.రామన్నపాలెంలో ఆదివారం ఎస్ఐ షరీఫ్ ప్రజలకు సైబర్ క్రైమ్, బాల్యవివాహాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా అసాంఘిక కార్యకాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈయనతోపాటు సిబ్బంది, తదితరులు ఉన్నారు.

నేడు ఇందుకూరుపేటలో యూరియా పంపిణీ

దేవీపట్నం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇందుకూరుపేట రైతు సేవా కేంద్రంలో సోమవారం ఉదయం 10 గంటలకు రైతులకు టీడీపీ మండల అధ్యక్షుడు గోళ్ల చంటిబాబు, జనసేన, బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో యూరియా పంపిణి చేయనున్నారు. రైతులు తమ ఆధార్‌కార్డు జిరాక్స్‌తో రైతు సేవా కేంద్రానికి వచ్చి తీసుకుని వెళ్లాల్సిందిగా ఏవో ఎం.సత్యాదేవి తెలిపారు.

ఘనంగా ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు

చింతూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): చింతూరులో ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శతాబ్ది ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. విజయ దశమినాడు ప్రారంభమైన హిందూ సమాజం కోసం, ప్రపంచ శాంతే లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

సమస్యల వలయంలో తుని ఏరియా ఆసుపత్రి



తుని ఏరియా ఆసుపత్రి

● ఆసుపత్రి నిర్వహణపై విమర్శలు
● వైద్యులు, సిబ్బంది కొరత
● ఇబ్బందులు పడుతున్న రోగులు

తుని రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): తుని ఏరియా ఆసుపత్రి తుని, ప్రత్తిపాడు, పాయకరావుపేట, నర్సీపట్నం నియోజకవర్గ ప్రజలకు ప్రధానమైనది. ఆయా నియోజకవర్గాల్లో గ్రామీణ ప్రాంతాల్లో పీహెచ్‌సీ, సీహెచ్‌సీలో వ్యాధులు నయం కాకుంటే తుని ఏరియా ఆసుపత్రిని సందర్శిస్తుంటారు. రోజుకు 500పైబడి రోగులు బుధ, శుక్రవారాల్లో అదనంగా గర్భిణులు, బాలింతలు వస్తుంటారు. ఇంత ప్రాముఖ్యత కలిగిన తుని ఏరియా ఆసుపత్రిలో వరుస వివాదాలు, విమర్శలు తావిస్తున్నాయి. వైద్యులు వ్యవహార శైలి రోగులపట్ల వ్యవహరిస్తున్న తీరుపై రోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా కవలలకు జన్మనిచ్చి తల్లి మృతి చెందడానికి ఆసుపత్రి వైద్యులు కారణమని బంధువులు ఆసుపత్రి ముందు ఆందోళన చేపట్టడం చర్చనీయాంశమైంది. ఆ ఘటనపై కలెక్టర్ స్పందించి విచారణకు ఆదేశించారు. ఈ క్రమంలో ఆసుపత్రిలో రోగుల నుంచి పలు సమస్యలు వినిపిస్తున్నాయి. కొన్నేళ్లుగా ఆసుపత్రిలో కీలకమైన విభాగాల్లో వైద్యులు, సిబ్బంది కొరత ఉండటంతో రోగులకు ఇబ్బంది తప్పడం లేదు. ప్రస్తుతం సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కాకినాడ డీసీహెచ్‌గా అదనపు బాధ్యతలు నిర్వహించడంతో పర్యవేక్షణాలోపం తోడై ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై రోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈఆసుపత్రిలో రూ.10.20కోట్ల అంచనాలతో చేపట్టిన పనులు పూర్తి కాకపోవడంతో రోగులకు సరిపడా గదులు లేక మెట్ల మార్గం, వరండాల్లో మంచాలువేసి వైద్యం అందించే పరిస్థితి ఏర్పడింది. ఆసుపత్రిలో శానిటేషన్ విభాగం పనుల్లో సక్రమంగా జరగకపోవడంతో ఈగలు, దోమలు వృద్ధి చెందడంతో పాటుగా ఎలుకల సంచారం పెరిగింది. ఇటీవల కొందరు రోగులను ఎలుకలు గాయపరిచిన సంఘటనలు ఉన్నాయి. ఆసుపత్రిలో విధుల్లో ఉన్న కొందరు వైద్యులు కొద్దిసేపటికే బయటకు వెళ్లిపోయి ప్రైవేట్ క్లినిక్‌లలో ఓపీలు చూడడం, రోగులను ప్రైవేట్ ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నట్టు తెలుస్తోంది. రోగులకు ఆహార పథకంపైన విమర్శలు ఉన్నాయి. తర చూ రోగులకు అందజేస్తున్న ఆహారంపై నాణ్యత లో పిస్తుందని రోగులు వాపోతున్నారు. ఈ ఆసుపత్రిలో ఉన్న లోపాలపై అధికారులు ఎలా స్పందిస్తారో చూడాలి.

సీఎంగా చంద్రబాబు 15ఏళ్లు స్వర్ణయుగం



మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు

● సీఎం చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి యనమల

తునిరూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర అభివృద్ధి ప్రదాత చంద్రబాబు అని, ముఖ్యమంత్రిగా ఆయన 15 ఏళ్ల కాలం ఓ స్వర్ణయుగమని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రం దశ, దిశను మార్చిన విలువైన ప్రస్థానం అని కొనియాడారు. ముఖ్యమంత్రిగా 15ఏళ్ల పూర్తి చేసుకున్న చంద్రబాబుకు యనమలతో పాటుగా ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య శుభాకాంక్షలు తెలిపారు. పూర్వ ఆంధ్రప్రదేశ్ నవ్యాంధ్ర అభివృద్ధి ప్రదాతగా ఈ 15 ఏళ్ల చంద్రబాబు పాలన చిరస్మరణీయమన్నారు. సంక్షోభం నుంచి అవకాశాలు సృష్టించుకుని తొలి అడుగును 1000 అడుగుల ప్రయాణంగా మల్చుకున్న బహుదూరపు బాటసారి చంద్రబాబు అని తెలిపారు. 1995-99, 2014-2024లో 4సార్లు ఆయన చేసిన ప్రయాణం అభివృద్ధి పథంలో రాష్ట్ర ప్రయాణానికి ఒక నాందిగా నిలిచిందనారు. 15 ఏళ్లుగా ముఖ్యమంత్రి చంద్రబాబుది అరుదైన రికార్డు అన్నారు. ఎన్ని ఒడిదుడుకులు ఉన్నా సరే రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలనే ఆయన సంకల్పం గొప్పదన్నారు. ఈ రాష్ట్ర ప్రజల మద్దతుతో చంద్రబాబు మరిన్ని సంవత్సరాలు ముఖ్యమంత్రిగా కొనసాగితే స్వర్ణాంధ్ర సహకారం అవుతుందని ఆయన తెలిపారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



అక్షయ కల్చరల్ అసోసియేషన్ నుంచి జ్ఞాపిక అందుకుంటున్న చైర్మన్ రోహిత్

అన్నవరం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఏర్పాటుచేసిన అక్షయ సోపల్ కల్చరల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన చిన్నారుల నృత్యప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. కూచిపూడి, భరతనాట్యం వంటి ప్రదర్శనలు ఇచ్చారు. చిన్నారులను ఆలయ ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్ అభినందించి జ్ఞాపిక లు అందజేశారు. సంస్థ ప్రతినిధులు ఈవో, చైర్మన్‌కు అభినందనలు తెలిపి సంస్థ తరుపున మెమెంటోలు అందజేశారు.

పెదమల్లాపురాన్ని మండల కేంద్రంగా చేయాలి



ఆదివాసీ సంఘం ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న సత్తిబాబు

రౌతులపూడి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): పెదమల్లాపురాన్ని మండల కేంద్రంగా చేయాలని అఖిల భారత ఆదివాసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంటిమళ్ల సత్తిబాబు డిమాండ్ చేశారు. ఆయన అధ్యక్షతన ఆదివారం రాఘవపట్నం ప్రాథమికోన్నత పాఠశాలలో ఆదివాసీ ఉద్యోగులు సంఘం సమావేశం నిర్వహించారు. శంఖవరం, ఏలేశ్వరం, రౌతులపూడి, ప్రత్తిపాడు, కోటనందూరు మండలాల్లో ఉన్న గిరిజన గ్రామాలు, నాన్ నోటిఫైడ్ గ్రామాలను ప్రభుత్వం తక్షణమే గుర్తించి నోటిఫైడ్ గ్రామాల జాబితాలో కలపాలని సమావేశంలో తీర్మానించారు. మండల కేంద్రంతోపాటు ఐటీడీఏను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పోలోజు వరహాలు, జర్తా ముసలియ్య, బాలరాజు, టి.నాగేశ్వరరావు, ముర్ల దొంగబ్బాయి, తల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ధరలు తగ్గుదల

ప్రత్తిపాడు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో ధరలు తగ్గుదలను సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ చెప్పారు. ఆదివారం పెదశంకర్లపూడిలో జీఎస్టీ తగ్గింపుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జీఎస్టీ తగ్గింపు కరపత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. నిత్యావసరాలు, గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులపై ధరలు తగ్గాయన్నారు. కూటమి నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

● అదుపుతప్పి బోల్తా కొట్టిన విహారయాత్ర వ్యాన్



మోతుగూడెం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): చింతూ రు మండలం చదలవాడ పంచాయతీ పరిధి దుర్గమ్మ గుడికి అరకిలో మీటరు దూరంలో ఆదివారం విహారయాత్రకు వెళ్తున్న టెంపో వ్యాన్ బోల్తా పడింది. వివరాలివి... కాకినాడ నుంచి మారుతి సుజుకీ వ్యాన్‌లో ఆ కంపెనీలో పనిచేస్తున్న 15మంది ఉద్యోగులు పొల్లూరు పర్యాటక ప్రదేశాన్ని సందర్శించడానికి వస్తుండగాఘాటిలో అదుపుతప్పి వాహనం పడిపోయింది. దీన్ని మారేడుమిల్లి నుంచి వస్తున్న రంపచోడవరం ఏపీ ట్రాన్స్‌కోలో పనిచేస్తున్న అప్పారావు, లైన్మెన్ గుబ్బల ప్రేమ్‌కుమార్, స్విచ్ ఆపరేటర్ చూసి అటుగా వస్తున్న మూడు కార్లను ఆపి గొడ్లగూడెం ప్రాథమిక ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మోతుగూడెం ఏపీ జెన్కో భవ్యతో ఆసు పత్రికి ఫోన్ చేసి అంబులెన్స్ పిలిపించి చింతూరు గవర్న మెంట్ హాస్పిటల్‌కి పంపించారు. ఎనిమిది మందికి చిన్నచిన్న గాయాలు కాగా, ఏడుగురికి పెద్ద గాయాలవ్వ డంతో మెరుగైన వైద్యం కోసం చింతూరు గవర్నమెంట్ హాస్పిటల్‌కి తీసుకెళ్లారు. చింతూరు సీఐ గోపాలకృష్ణ మోతుగూడెం ఎస్ఐ హుస్సేన్ గాయ పడిన వారిని పరామర్శించారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపినట్టు సీఐ, ఎస్ఐ తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

అజాత శత్రువు దొంగబాబు: ఎమ్మెల్యే నెహ్రూ



కాళ్ళ దొంగబాబు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే నెహ్రూ

కిర్లంపూడి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కాళ్ళ దొంగబాబు అజాత శత్రువు అని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ అన్నారు. కిర్లంపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద దొంగబాబు విగ్రహాన్ని కుమారులు కాళ్ళ వెంకటేష్, భద్రాచలం, చంటి, దుర్గా ప్రసాద్, గోవింద రాజు నెలకొల్పారు. సర్పంచ్ గుడాల శ్రీలత రాంబాబు, తూము కుమార్, చదరం చంటి బాబు, కుర్ల చినబాబు పర్యవేక్షణలో ఆదివారం విగ్రహావిష్కరణ నిర్వహించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జ్యోతుల నవీన్ కుమార్, జడ్పీ మాజీ ప్రతిపక్ష నేత తోట నవీన్, జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు. దొంగబాబు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం పని చేసిన వ్యక్తి దొంగబాబు అన్నారు. జగపతినగరం, చిల్లంగి, కిర్లంపూడి గ్రామాలోనే కాకుండా నియోజకవర్గంలో మంచి పేరు సంపాదించుకున్నాడన్నారు. ప్రతి కార్యకర్త ఒక ప్రజా ప్రతినిధిగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బస్వా వీరబాబు, ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, టీడీపీ మండలాధ్యక్షుడు వీరంరెడ్డి కాశీబాబు, కుంచే తాతాజీ, తోట వరుణ్ పాల్గొన్నారు.

విద్యార్థుల అపూర్వ కలయిక



సిరిపురం పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఏలేశ్వరం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో 1990-95 బ్యాచ్ 6 నుంచి నుంచి 10వ తరగతి చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. వివిధ ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడి సుమారు 30 ఏళ్ల తరువాత తాము చదువుకున్న పాఠశాలలోనే తోటి స్నేహితులను కలుసుకుని నాటి మధురానుభూతులను జ్ఞాపకం చేసుకుని ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు ఘనంగా సత్కరించారు. యల్లపు సురేంద్ర, పసల అప్పారావు, మేడిద సిహాచలం, పలివెల కుమార్, షేక్ భాను పాల్గొన్నారు.

'లోవ'లో భక్తుల కోలాహలం

రూ.5.26 లక్షల ఆదాయం



పూజల నిర్వహిస్తున్న దృశ్యం



ప్రాంగణంలో భక్తులు

తుని రూరల్, అక్టోబరు 12 (ఆంధ్ర జ్యోతి): ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ప్రత్యేక క్యూలలో బారులు తీ రి అమ్మవారిని దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా వసతి గదుల్లో వంటావార్పు చేసుకుని భోజనాలు చేశారు. ఆలయానికి వివిధ విభాగాల ద్వారా రూ.5.26 లక్షల ఆదాయం సమకూరినట్టు ఈవో విశ్వనాధరాజు తెలిపారు.

చెత్త తొలగదు.. దుర్గంధం వీడదు



డ్రైన్ పూడికపోవడంతో నిలిచిపోయిన మురుగునీరు

తుని రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): తుని మున్సిపాల్టీలో పారిశుధ్య నిర్వహణకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించి పరిశుభ్రతకు ప్రాధాన్యతను ఇస్తున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో ఆ పరిస్థితి కానరావడం లేదు. ఎక్కడి చెత్త అక్కడ తాండవిస్తూ వార్డులు దుర్గంధ భరితంగా మారుతున్నాయి. చెత్త సేకరణ రోజూ చేయాల్సి ఉన్న అది కాస్త జరగడంలేదని పట్టణ వాసులు వాపోతున్నారు. ఫలితంగా ఈగలు, దోమలు వృద్ధి చెంది అనారోగ్యం పాలవుతున్నామని వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో పర్యటనలు చేస్తూ పారిశుధ్య మెరుగుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రూ.5లక్షల బాణసంచా సీజ్

తునిరూరల్,అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఎస్.అన్నవరం గ్రామంలో అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన బాణసంచా సామాగ్రి స్థావరంపై తుని రూరల్ పోలీసులు దాడి చేశారు. సుమారు రూ.5లక్షల విలువైన సామాగ్రి సీజ్ చేశారు. సరుకు నిల్వ ఉంచిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ కృష్ణమాచారి తెలిపారు.

ఎస్.అన్నవరంలో పట్టుబడిన బాణసంచా సామగ్రితో పోలీసులు →





ఏలేరులో ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు

ఏలేరుకు జలకళ

ఏలేశ్వరం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఏలేరులో జలాశయంలో నీటి నిల్వలు స్వల్పంగా పెరుగుతున్నాయి. గోదావరి జలాలతోపాటు, మోస్తరు వర్షాలతో రిజర్వాయర్‌లో నీరు పెరుగుతోంది. ప్రాజెక్టులో నీటి నిల్వలు రోజురోజుకు పెరుగుతున్నాయి. పురుషోత్తమపట్నం ఎత్తిపోతల పథకం నుంచి గోదావరి జలాలు 525 క్యూసెక్కులు ఏలేరు జలాశయానికి విడుదలవుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని రీతిలో ప్రాజెక్టులో 86.56 మీటర్ల స్థాయిలో 24.11 టీఎంసీల నీటిని నిల్వ చేసే అవకాశం ఉంది. 84.92 మీటర్ల స్థాయిలో 20.84 టీఎంసీలు నిల్వలున్నాయని అధికారులు తెలిపారు. ఎడమకాలువ నుంచి విశాఖపట్నానికి 175 క్యూసెక్కులు వంతున నీరు చేరుతోంది.

ఆకట్టుకున్న తాటకి వధ నాటకం



తాటకి వధ నాటకంలోని ఓ సన్నివేశం

ప్రత్తిపాడు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం గ్రామంలో గౌరీశంకర్ల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక కళాకారులు ప్రదర్శించిన తాటకి వధ కళారూపకం విశేషంగా ఆకట్టుకుంది. రామాలయంలో సీతారాముల వనవాస ఘట్టంలో తాటకి వధ ఇతివృత్తాన్ని తీసుకుని ఈ కళా ప్రదర్శన నిర్వహించారు. శ్రీరాముడిగా పడాల నాని, లక్ష్మణుడిగా జొన్నాడ వెంకటరమణ, విశ్వామిత్రుడిగా ఎం.లక్ష్మణరావు, తాటకిగా చెన్నాడ శివ తాతారావు నటించి ప్రేక్షకుల ప్రసంశలు పొందారు.

ఒమ్మంగిలో ఎమ్మార్పీఎస్ సమావేశం

ప్రత్తిపాడు, అక్టోబరు12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒమ్మంగి గ్రామంలో జిల్లా ఎమ్మార్పీఎస్ అనుబంధ ముఖ్య నాయకుల సమావేశం అధ్యక్షుడు అనంతారపు రాజు మాదిగ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు కార్యాచరణ అమలు చేయాలన్నారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై జరిగిన దాడికి 10రోజుల పాటు జిల్లాస్థాయిలో నిర్వహించే ఉద్యమ కార్యాచరణలో భాగస్వాములు కావాలన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చినశంకర్లపూడిలో భారీ అన్నదానం

ప్రత్తిపాడు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినశంకర్లపూడిలో ఆదివారం భారీ అన్నదానం నిర్వహించారు. స్థానిక కనకదుర్గమ్మ ఆలయం వద్ద దేవీ నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా నిర్వహించిన ఈ అన్నదానంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, స్థానిక టీడీపీ నాయకులతోపాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రత్యేక పంచాయతీ ఏర్పాటుకు సహకరించండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

శంఖవరం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలో గొంది కొత్తపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న గొంది, రాజారం, మాసంపల్లి, ఎంజే పురం పంచాయతీలను ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభను నేతలు కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందించారు. ఈ గ్రామాల్లో 1100 మంది జనాభా ఉన్నారని, వీటిని పంచాయతీగా గుర్తిస్తే మరింత అభివృద్ధి సాధ్యపడుతుందని వినతిలో కోరారు. గతంలో సీతంపేట, అచ్చింపేట గ్రామాలను నూతన పంచాయతీలుగా ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మాజీ సర్పంచి శ్రీకృష్ణలోవరాజు, బి.లక్ష్మీ, ఎన్.రాజు తదితరులున్నారు.

రత్నగిరిపై పెళ్లి బృందానికి దళారీ టోకరా

ఈవోకు ఫిర్యాదు

అన్నవరం, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి):అన్నవరం దేవస్థానంలో వివాహం చేసుకునేందుకు విచ్చేసిన వివాహ బృందానికి ఒక దళారీ టోకరా వేసి చెప్పిందొకటి చేసిందొకటని ఈవోకు ఫిర్యాదు చేశారు. కైకలూరుకు చెందిన ఒక బృందానికి ఏసీ ఉచిత కల్యాణ మండపం, పురోహితుడు, భజంత్రీలు, రెండు ఏసీ రూములు ఇప్పిస్తానని రూ.25వేలకు ఒప్పందం కుదుర్చుకుని వాటిలో ఏసీ మండపం, ఏసీ రూములు ఇవ్వకుండా చేశాడని అనంతరం దర్శనానికి వెళ్లేసమయంలో తమను ఇబ్బంది పెట్టాడని ఈవోకు ఫిర్యాదుచేయడంతో ఆయన విచారణకు ఆదేశించారు. పెళ్లిబృందాలు దళారులను సంప్రదించకుండా నేరుగా కార్యాలయానికి వెళ్లి తమకు కావలిసినవి బుకింగ్ చేసుకునేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

అయ్యప్ప భక్తుల పూజ

ప్రత్తిపాడు,అక్టోబరు12(ఆంధ్రజ్యోతి):ప్రత్తిపాడులో అయ్యప్పసేవా ట్రస్టు ఆధ్వర్యంలో అయ్యప్ప దీక్షాదారులకు శివ స్వాములు ఏర్పాటు చేసిన పూజల్లో ఆదివారం ఎమ్మెల్యే సత్యప్రభ పాల్గొన్నారు. అయ్యప్ప భక్తులకు ఆమె ప్రసాదం, బిక్ష వడ్డించారు. అయ్యప్ప మాలధారణ దీక్షలు ఎంతో పవిత్రమైనవన్నారు. అధిక సంఖ్యలో అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.